



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 260 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 11 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-




### ఎన్డీయే వచ్చాక దేశ ప్రజల్లో

# నమ్మకం పెరిగింది

## ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

**విశ్వం వాయిస్ న్యూస్ :**

కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు. "కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవ స్థలు ధ్వంస మయ్యాయి. రూ.వేల కోట్ల కుంభ కోణాలు జరి గాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది..**

"గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడే వారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయి" అని అన్నారు.

### ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని

# మోదీ పెంచారు

## ఏపీ సీఎం చంద్రబాబు



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశాభివృద్ధి కోసం నిరంతరం తపించే వ్యక్తి.. ప్రధాని మోదీ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని మోదీ పెంచారని చెప్పారు. రాష్ట్రాల అభివృద్ధికి కూడా కేంద్రం పూర్తిగా మద్దతి స్తోందన్నారు. "ఎన్డీయే ఏర్పడింది మిగతా .. 2లో..

### ఉత్తర-దక్షిణ విభజన వాదం

# దేశానికి ప్రమాదకరమని పవన్ హెచ్చరిక

- తొలిసారిగా ఏఎన్ఐకి ఇచ్చిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు
- రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టవద్దు
- ఏపీకి రూ.7,707 కోట్లు కేటాయించిన కేంద్రానికి ధన్యవాదాలు
- తాను తెలంగాణను ఎప్పుడూ వ్యతిరేకించలేదన్న పవన్ కల్యాణ్
- విభజన జరిగిన తీరును మాత్రమే వ్యతిరేకించినట్లు వెల్లడి




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణులు దేశ సమగ్రతకు అత్యంత ప్రమాదకరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. ఇలాంటి విభజనవాద ధోరణులు దేశ శ్రేయస్సుకు ఏమాత్రం శ్రేయస్కరం కావని ఆయన స్పష్టం చేశారు. తాను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఎన్నడూ వ్యతిరేకించలేదని, కేవలం విభజన జరిగిన అశాస్త్రీయ విధానాన్ని మాత్రమే తప్పుబట్టానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. తొలిసారిగా ఆయన ఢిల్లీలో ఏఎన్ఐ వార్తాసంస్థ ఎడిటర్ స్మితా ప్రకాశ్‌తో నిర్వహించిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయాలు, పరిపాలన, వ్యక్తిగత అంశాలతో పాటు పలు జాతీయ అంశాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. సుమారు 84 నిమిషాల పాటు సాగిన ఈ ఇంటర్వ్యూలో పవన్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న నాయకులు ఒక ప్రాంతాన్ని మరో ప్రాంతంతో పోల్చి ప్రజల మధ్య వైషమ్యాలు పెంచడం సరికాదన్నారు. గతంలో కొందరు నేతలు తనను హైదరాబాద్ రావొద్దని అన్నారని గుర్తు చేస్తూ, అదే తర్కాన్ని పాటిస్తే రాహుల్ గాంధీ వంటి జాతీయ నాయకులను కూడా కొన్ని ప్రాంతాలకు వెళ్లవద్దని చెప్పాల్సి ఉంటుందని, ఇటువంటి సంకుచిత రాజకీయాలు దేశానికి తగవని హితవు పలికారు. 570కి పైగా సంస్థానాలను విలీనం చేసి భారతదేశాన్ని పటిష్ఠం చేసిన చరిత్రను స్మరిస్తూ, విభజనవాదం దేశ ఐక్యతకు గొడ్డలిపెట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు. 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ. 7,707.21 కోట్లు కేటాయించినందుకు పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు అందిన నిధుల్లో ఇది మూడో అత్యధిక కేటాయింపు అని ఆయన పేర్కొన్నారు. ఈ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ మిగతా .. 2లో..

### భారతీరాజ్ ఆత్మకు

# శాంతి చేకూరాలి

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ దర్శకులు భారతీరాజా కన్నుమూశారని తెలిసి చింతించానని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సంతాపం తెలిపారు. తమిళ, తెలుగు చిత్రాలపై భారతీరాజా తనదైన ముద్ర వేశారన్నారు. గ్రామీణ నేపథ్యం, పల్లె ప్రజల జీవనం, ప్రేమానుబంధాలను, టీనేజర్స్‌కి ఉండే ఆకర్షణలు లాంటివి చూపించడంలో ఆయన శైలి ప్రత్యేకమైనది. ఆయన తెలుగులో దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' మిగతా .. 2లో..

### ఉక్కు కారాగార బాధితులకు

# జగన్ భరోసా

**కుటుంబాలకు పరామర్శ అండ - పరిహారం ఇవ్వాలని డిమాండ్ - కీలక హామీ ఇచ్చిన జగన్**



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నంలోని ఉక్కు కర్మాగారంలో ఇటీవల జరిగిన ప్రమా దంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుం బాలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శిం చారు. ఈ సందర్భంగా బాధిత కుటుం బాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో ప్రభావితమైన ప్రతి కుటుంబానికి న్యాయం జరగాలని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్న అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం వెంటనే స్పందించి మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుం బానికి కోటి రూపాయల పరిహారం అందిం చాలని జగన్ డిమాండ్ చేశారు. అలాగే కుటుం బంలో ఒకరికి శాశ్వత మిగతా .. 2లో..

# మంత్రి చెప్పినా వినరా?

**తెనాలి మున్సిపల్ అధికారులపై నాదెండ్ల ఆగ్రహం**



**తెనాలి, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని తూర్పు కాల్వకట్ట రోడ్డులో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండ్రోజుల క్రితం ఆ ప్రాంతంలో పర్యటించినప్పుడు.. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వ్యర్థాలు పేరుకుపోవడాన్ని స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే వ్యర్థాలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్, సిబ్బందిని మంత్రి ఆదేశించారు. బుధవారం ఉదయం అటువైపు వెళ్లిన మంత్రి.. వ్యర్థాలు తొలగించకపోవడాన్ని గమనించి మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను ఘటనాస్థలికి పిలిపించి ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. చెత్త కుప్పలు ఎక్కువగా ఉన్నాయని.. టెండర్ పిలిచి తొలగిస్తామని మున్సిపల్ సిబ్బంది సమాధానం చెప్పారు. మున్సిపాలిటీ జేసీబీ, మిగతా .. 2లో..

### అనధికార భవనాలు, లేఅవుట్లు క్రమబద్ధీకరణపై

# ప్రజలకు అవగాహన కల్పించాలి

## మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్ని మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, స్ట్రీట్ లైట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య సమస్యలు లేకుండా కమిషనర్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. అనధికార భవనాలు, లేఅవుట్లు క్రమబద్ధీకరించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మార్చి నెలాఖరు నాటికి లెగసీ వేస్ట్ పూర్తిగా తొలగించాలని స్పష్టం చేశారు. వీధి కుక్కలు, పందులతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు మిగతా .. 2లో..

# రణరంగంగా పశ్చిమాసియా..

## అమెరికా-ఇరాన్ మధ్య భీకర దాడులు




**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియా మరోసారి రణరంగంగా మారింది. హర్మూజ్ సమీపంలో అపాచీ హెలికాప్టర్ కూలిపోయిన ఘటనకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. దీనికి టెహ్రాన్ కూడా గట్టిగా ప్రతిస్పందిస్తోంది. గల్ఫ్ ప్రాంతాల్లో అగ్రరాజ్య స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు చేస్తోంది. అమెరికా దాడులను దురాక్రమణ చర్యగా ఐఆర్‌జీసీ అభివర్ణించింది. బహ్రెయిన్‌లోని అమెరికా నావికా ఫ్లీట్‌తో మిగతా .. 2లో..

### కుట్రలు తప్ప జగన్‌కు

# అభివృద్ధి పట్టదు

**అన్ని వ్యవస్థలను జగన్ నాశనం చేశారన్న మంత్రి కొల్లు రవీంద్ర**



**కాణిపాకం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు జవాబుదారీగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని రాష్ట్ర మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ విచ్చలవిడిగా వ్యవహరిస్తూ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను పూర్తిగా నాశనం మిగతా .. 2లో..

### చరిత్రాత్మక మైలురాయిని అధిగమించిన

# మోదీకి శుభాకాంక్షలు

**భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికైన ప్రధాన మంత్రిగా అత్యధిక కాలం సేవలందించిన నరేంద్ర మోదీ ఒక చరిత్రాత్మక మైలురాయి అధిగమించారని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఆయన 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసం, ఆకాంక్షలకు ప్రతీక అని పేర్కొన్నారు. 4,399 రోజులు.. భారతీయ చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిన చరిత్రాత్మక రోజులని చెప్పారు. "గరీబ్ కల్యాణ్ నుంచి మహిళా సాధికారత వరకు.. రైతుల గౌరవం నుంచి యువతకు అవకాశాల సృష్టి వరకు.. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల నుంచి డిజిటల్ పబ్లిక్ మిగతా .. 2లో..

### పుట్టినరోజున

# బాలకృష్ణ కీలక ప్రకటన


**జూన్ 22న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవాల ముగింపు సభ**




**విశ్వం వాయిస్ న్యూస్ :** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న రజతోత్సవ వేడుకల ముగింపు సభను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆసుపత్రి ఛైర్మన్, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రకటించారు. జూన్ 22వ తేదీన మిగతా .. 2లో..

### పాక్ బాంబుల వర్షం..

# నిద్రలోనే 11మంది చిన్నారుల మృతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** అఫ్గానిస్థాన్-పాకిస్థాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తలెత్తాయి. అర్ధరాత్రి వేళ.. అఫ్గాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై పాక్ బాంబులతో విరుచుకుపడింది. ఈ ఘటనలో 11 మంది చిన్నారులు నిద్రలోనే కన్నుమూశారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఖోస్ట్, కునార్, పక్తికా ప్రావిన్స్‌లలోని పౌర నివాసాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు అఫ్గాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ పేర్కొన్నారు. సెర్పా జిల్లాలోని ఓ ఇంటిపై జరిగిన దాడిలోనే 9 మంది చనిపోయారని, మరో 10 మంది గాయపడ్డారని ఖోస్ట్ ప్రావిన్స్‌కు చెందిన అధికారి మిగతా .. 2లో..

# అమరావతిలో భారీ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం



- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాసాల కోసం రూ.1235 కోట్లు కేటాయింపు
- మొత్తం 11 టవర్లలో 1504 నివాస గృహాలు నిర్మించనున్న సీపీడబ్ల్యూడీ
- పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మాణం
- నిర్మాణ, నిర్వహణ దశల్లో స్థానికంగా భారీగా ఉపాధి అవకాశాలు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అభివృద్ధి పనుల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ), అమరావతిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం భారీ నివాస సముదాయాల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం రూ. 1,234.91 కోట్లను కేటాయిస్తూ నిర్ణయం మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# మంత్రి చెప్పినా వినరా?

ట్రాక్టర్లతో చేయాల్సిన పనికి టెండరా? అని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవుపెట్టి వెళ్లండని హెచ్చరించారు. వ్యర్థాలు తొలగించే వరకు ఇక్కడే ఉంటానని కాల్వగట్టుపై ఉన్న బల్లపై కూర్చున్నారు. దీంతో హడావుడిగా అక్కడికి చేరుకున్న మున్సిపల్ యంత్రాంగం.. చెత్త తొలగింపు పనులు చేపట్టింది.

# ఉక్కు కారాగార బాధితులకు జగన్ భరోసా

ఉద్యోగం కల్పించి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని కోరారు. ప్రమా దం కారణంగా కుటుంబ పెద్దను కోల్పోయిన వారిని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఇలాంటి విషాద ఘటనల్లో కేవలం సానుభూతి మాటలు సరిపోవని, బాధిత కుటుంబాల జీవనోపాధికి భరోసా కల్పించే చర్యలు అవ సరమని జగన్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక ఇబ్బం దుల్లో ఉన్న కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంతో పాటు దీర్ఘకాలికంగా వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొ న్నారు. ప్రస్తుత ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం, ఉద్యోగం కల్పించడంలో విఫలమైతే తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బాధ్యతను తాము నిర్వర్తిస్తామని జగన్ హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిరాశపరచబోమని, వారికి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరగాలని పలు వర్గాలు కోరుతున్నాయి. కార్మికుల ప్రాణ భద్రత విషయంలో మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉక్కు కర్మాగారాలు వంటి భారీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడం అత్యంత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# భారతీరాజ్ ఆత్మకు శాంతి చూకూరాలి

ఇప్పటికీ చూడదగ్గ విధంగా ఉంటుందన్నారు. ఆ చిత్రంలోని పాటలు, సన్నివేశాలు ప్రేక్షకులను మెప్పించాయన్నారు. అన్నయ్య చిరంజీవితో 'ఆరాధన' చిత్రం రూపొందించారని, అందులో 'అరె ఏమైంది...' అనే పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. సున్నితమైన ప్రేమ, సెంటిమెంట్ కథలే కాకుండా 'ఎర్ర గులాబీలు', 'టిక్ టిక్ టిక్' లాంటి థ్రిల్లర్స్ తోను ప్రేక్షకులను మెప్పించారన్నారు. భారతీరాజా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నానని పవన్ తెలిపారు.

# నిద్రలోనే 11మంది చిన్నారుల మృతి

తెలిపారు. పక్తికా ప్రావిన్స్‌లోని బర్మల్ జిల్లాలో జరిగిన మరో దాడిలో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా చిన్నారులేనని స్థానికులు తెలిపారు. బాధితులు నిద్రిస్తున్న సమయంలో ఈ దాడులు జరగడంతో.. వారు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ దాడి ఘటనలో మొత్తం 11 మంది చిన్నారులతో సహా ఓ మహిళ, ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గాయపడగా.. వారిలో అనేకమంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. మృతి చెందిన చిన్నారుల ఫొటోలను జబిహుల్లా ఎక్స్‌లో పంచుకున్నారు. కాగా.. ఈ దాడుల విషయంపై పాక్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అఫ్గాన్ సరిహద్దుల్లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని ఓ సెక్యూరిటీ పోస్టుపై ఇటీవల దాడి జరిగింది. తాలిబన్ మిలిటెంట్లు ఈ దాడి చేసినట్లు పాక్ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయపడ్డారని పాక్ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. ఈ ఘటన జరిగిన నేపథ్యంలో అఫ్గాన్‌పై వైమానిక దాడులు చేయడం గమనార్హం.

# రణరంగంగా పశ్చిమాసియా..

పాటు, జోర్డాన్‌లోని ఆ దేశానికి చెందిన అల్ అజ్రాక్ వైమానిక స్థావరం లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. కువైట్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా ఉత్తర ఇరాక్‌లలో పలు పేలుడు శబ్దాలు వినిపించాయి. తమ భూభాగంపై దాడులు ఇలానే కొనసాగితే.. తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. దీనికి ముందు దక్షిణ ఇరాన్‌లోని జాస్క్, సిరిక్, ఖేష్మ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా యూఎస్ దళాలు దాడులు చేశాయి. ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్‌పై ఆత్మరక్షణ దాడులు ప్రారంభించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ దాడులను ట్రంప్ సమర్థించుకున్నారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌కు గట్టి సందేశం ఇచ్చేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 'ప్రతిస్పందనలు చాలా ముఖ్యం అని నేను భావిస్తున్నా. వారు మా హెలికాప్టర్‌ను కూల్చివేశారు. వారు చేసిన దానికి ఇది మా ప్రతిస్పందన. ఇది చాలా బలంగా.. అత్యంత శక్తిమంతంగా ఉండాలని అనుకుంటున్నా' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**అమెరికా ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ కూల్చేశాం..**

వైమానిక ఘర్షణ నేపథ్యంలో.. బుషెహర్ ప్రావిన్స్‌పై ఒక అమెరికా ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ కూల్చివేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా విడుదల చేసింది. అయితే, ఈ ప్రకటనను అమెరికా ఇంకా ధ్రువీకరించలేదు.

**క్షేమంగా ఉండాలంటే.. ఇరాన్ వార్నింగ్**

దాడుల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. యూఎస్ తమ సహనాన్ని పరీక్షిస్తోందన్నారు. దాడులు, బెదిరింపులకు తమ సాయుధ దళాలు కచ్చితంగా స్పందిస్తాయన్నారు. క్షేమంగా ఉండాలనుకుంటే.. వెంటనే ఈ ప్రాంతాన్ని వీడాలని యూఎస్ బలగాలను హెచ్చరించారు.

# అమరావతిలో భారీ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బడ్జెటరీ మద్దతు ద్వారా భరించనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) చేపట్టనుంది. ఇప్పటికే ప్రీ-బిడ్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, టెండర్ పత్రాల రూపకల్పన ప్రక్రియ పురోగతిలో ఉందని కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా రాజధాని అమరావతిలో కేంద్రం చేపడుతున్న మొట్టమొదటి జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జీపీఆర్ఏ) ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం. మొత్తం 17 ఎకరాల విస్తీర్ణంలో ఈ జీపీఆర్ఏ క్యాంపస్‌ను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా 11 నివాస టవర్లను ఏర్పాటు చేసి, టైప్-2 నుంచి టైప్-6 వరకు వివిధ కేటగిరీలలో మొత్తం 1,504 ఫ్లాట్లను నిర్మిస్తారు. ప్రాజెక్టులో భాగంగా 1,972 కార్లు పార్క్ చేసుకునేలా బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తారు. ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణ విస్తీర్ణం 31.30 లక్షల చదరపు అడుగులుగా ఉంది.

**ప్రాజెక్ట్ లక్ష్యాలు.. ప్రయోజనాలు**

అమరావతిలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించి, వారికి తగిన నివాస సౌకర్యం కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. కార్యాలయాలకు సమీపంలోనే నివాసం ఉండటం వల్ల ఉద్యోగుల నైతిక స్థైర్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇది ప్రభుత్వ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగేందుకు దోహదపడుతుందని ప్రకటనలో వివరించారు.

**పర్యావరణ హిత నిర్మాణం.. సకల సౌకర్యాలు**

ఈ ప్రాజెక్టును పూర్తిగా పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. కనీసం 4-స్టార్ గ్రీహా (జీఆర్ఐహెచ్ఏ) రేటింగ్ సాధించేలా, ఇంధన సామర్థ్యం, నీటి సంరక్షణ, స్థానిక నిర్మాణ సామగ్రి వాడకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. క్యాంపస్‌లో బ్యాంకు, ఏటీఎం, పోస్టాఫీసు, కమ్యూనిటీ హాల్, ఫుడ్ కోర్ట్, షాపింగ్ కాంప్లెక్స్, గెస్ట్ హౌస్ వంటి అన్ని రకాల పౌర, సామాజిక సదుపాయాలు ఉంటాయి. అలాగే, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా అవరోధ రహిత వాతావరణాన్ని కల్పించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. నిర్మాణ దశలో ఏటా సుమారు 7 లక్షల పనిదినాలు, ప్రాజెక్టు పూర్తయ్యాక నిర్వహణ దశలో ఏటా 50,000 పనిదినాల ఉపాధి కలుగుతుందని కేంద్రం తెలిపింది.

# కుట్రలు తప్ప జగన్‌కు అభివృద్ధి పట్టదు

చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొల్లు రవీంద్ర తెలిపారు. "గడిచిన రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అత్యద్భుతంగా అభివృద్ధి చేశాం. కుట్రలు, కుతంత్రాలు చేయడం తప్ప జగన్‌కు రాష్ట్ర అభివృద్ధి అస్సలు పట్టదు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారు" అని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో సాధించిన ప్రగతిని, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలందరికీ వివరించబోతున్నామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

# మోదీకి శుభాకాంక్షలు

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు.. ఆర్థిక వ్యవస్థ ఫార్మలైజేషన్ నుంచి ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం వరకు.. ప్రతి రంగంలోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, బలమైన జాతీయ భద్రతా విధానం, నక్సలిజం క్షీణత, ఈశాన్య భారతంలో శాంతి, అభివృద్ధి, బలమైన సరిహద్దులు, విస్తృతమైన సామాజిక భద్రతా వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన ఆధునికీకరణ, భారత స్టార్టప్ సంస్కృతి ఎదుగుదల.. ఇవన్నీ జాతీయ పునరుజ్జీవనానికి కొత్త యుగాన్ని సూచిస్తున్నాయి" అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# బాలకృష్ణ కీలక ప్రకటన

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ నోవాటెల్ హోటల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, జాతీయ నాయకులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ వివరాలను ఆయన తెలియజేశారు. ఈ ముగింపు వేడుకకు కేంద్ర ఆరోగ్య శాఖమంత్రి జె.పి. నడ్డా, భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా హాజరవుతారని బాలకృష్ణ తెలిపారు. వీరితో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశిష్ట అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్, తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

**సేవా పథంలో 25 ఏళ్లు.. భవిష్యత్‌పై కీలక ప్రకటనలు**

2000వ సంవత్సరంలో తన తల్లిదండ్రులు స్వర్గీయ నందమూరి తారకరామారావు, శ్రీమతి బసవతారకం ఆశయాలకు అనుగుణంగా ఈ ఆసుపత్రిని ప్రారంభించామని బాలకృష్ణ గుర్తుచేసుకున్నారు. లాభాపేక్ష లేకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ రోగులకు సేవలందించడమే లక్ష్యంగా గత 25 ఏళ్లుగా సంస్థ పనిచేస్తోందన్నారు. గత సంవత్సర కాలంగా రజతోత్సవాల సందర్భంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ వేడుకల ద్వారా గడిచిన కాలాన్ని సమీక్షించుకుంటూ, భవిష్యత్ కార్యాచరణను కూడా ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రి ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో "నార్త్ బ్లాక్" నిర్మాణం, అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని తుళ్లూరులో మరో నూతన ఆసుపత్రి నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ 25 ఏళ్ల ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరినీ స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితోనే ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

**చిన్నారుల మధ్య బాలయ్య జన్మదిన వేడుకలు.. విరాళాల వెల్లువ**

మీడియా సమావేశానికి ముందు, నందమూరి బాలకృష్ణ తన పుట్టినరోజును ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్యాన్సర్ బాధిత చిన్నారుల మధ్య జరుపుకున్నారు. సిబ్బంది ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను చిన్నారులతో కలిసి కట్ చేసి, వారికి పంచిపెట్టారు. అనంతరం వారికి ఆటబొమ్మలు, ఇతర బహుమతులు అందించి వారి ముఖాల్లో ఆనందం నింపారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి పలువురు ఉదారంగా విరాళాలు అందించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ సీతారామారాజు అందించిన లక్ష రూపాయల విరాళాన్ని బాలకృష్ణ స్వీకరించారు. త్రివేణి, కృష్ణవేణి పాఠశాలల విద్యార్థులు క్యాన్సర్ రోగుల సహాయార్థం సేకరించిన రూ. 1,01,116 విరాళాన్ని ఆయకు అందజేశారు. చిన్న వయసులోనే విద్యార్థులు చూపిన సేవాగుణాన్ని బాలకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. అమరావతిలో నిర్మించనున్న ఆసుపత్రి కోసం శ్రీ కాకర్ల రాఘవేంద్ర రావు అందించిన రూ. 10 లక్షల చెక్కును కూడా ఆయన స్వీకరించారు. దాతలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బాలకృష్ణతో పాటు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి. సుబ్రహ్మణ్యేశ్వర రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికోటేశ్వర రావు, అకడమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా రఘునాథ్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని

# మోదీ పెంచారు

ఎన్నికల కోసం కాదు.. దేశం కోసం. అధికారం కోసం కాదు.. జాతీయ ప్రయోజనాల కోసం. రాష్ట్రాల్లో ఎన్డీయే సాధిస్తున్న వరుస విజయాలే మా పనితీరుకు సాక్ష్యం. బిహార్, అస్సాం, పుదుచ్చేరిలో ప్రజలు మళ్లీ మాకు పట్టం కట్టారు. ఆయా రాష్ట్రాల్లో ఈ విజయాలు.. సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు. బెంగాల్.. మళ్లీ దేశానికి మార్గదర్శకంగా నిలిచే రోజు దగ్గర్లోనే ఉంది. ప్రాచీన జ్ఞానం, డిజిటల్ పాలన, ఆవిష్కరణలే భారత్‌కు అతిపెద్ద బలం. అడ్డంకులు తొలగించి, స్పష్టమైన విధానాలతో దేశాన్ని మోదీ ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రతి భారతీయుడి మనోభావాలు అర్థం చేసుకున్న నాయకుడు.. మోదీ"అని చంద్రబాబు అన్నారు.

# దేశానికి ప్రమాదకరమని పవన్ హెచ్చరిక

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే తన ఆకాంక్ష అని పవన్ కల్యాణ్ తెలిపారు. తెలంగాణలో కూడా తమ పార్టీ పోటీ చేయాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారని వెల్లడించారు. ఈ దేశంలో పౌరులు ఎవరైనా, ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఇంటర్వ్యూలో భాగంగా తెలంగాణపై తన భవిష్యత్ ప్రణాళికలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, ఉచిత పథకాల ప్రభావం, భాషా రాజకీయాలు, ఐటీ రంగంలో ఉద్యోగాల కల్పన వంటి అనేక అంశాలపై పవన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్డీయే సమావేశాల నిమిత్తం ఢిల్లీలో ఉన్న తరుణంలో ఆయన ఈ పాడ్‌కాస్ట్‌లో పాల్గొనడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఖజానాపై ఉచితాల ఒత్తిడి
# తెలంగాణ ఆర్థిక భవితవ్యం ఏమిటి?

2014 జూన్ 2 తెలంగాణ కోటి రత్నాల వీణగా గళమెత్తిన వేళ. దశాబ్దాల పోరాటాల ఫలితంగా ఆవిర్భవించిన నూతన రాష్ట్రం, ఆర్థిక స్వావలంబనపై గగనమంత ఆశలు పెట్టుకుంది. భాగ్యనగరం ఐటీ హబ్‌గా, ఫార్మా రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా, రియల్ ఎస్టేట్ సామ్రాజ్యంగా దూసుకుపోతుంటే, కొత్త రాష్ట్ర ప్రస్థానం పూలబాటలా సాగుతుందని అంతా భావించారు. అయితే, గత రెండు మూడు సంవత్సరాలుగా కథ మారింది. గులాబీ గుబాళింపులు తగ్గాయి.కాంగ్రెస్ హస్తం పరిపాలనలోనూ సవాళ్లు ఎదురవుతున్నాయి. రాష్ట్ర ఖజానాలో వెలుగులు తగ్గి, చీకట్లు అలుముకుంటున్నాయి. ఆదాయంలో స్పష్టమైన క్షీణత కనిపిస్తోంది. మరి తెలంగాణ ఆర్థిక రథ చక్రాలు ఎందుకు వెనక్కి మళ్లుతున్నాయి? ఈ సంక్షోభం వెనుక ఉన్న అసలు సిసలైన కారణాలేమిటి? తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2024-25 ఘణాంకాలను ఒకసారి పరిశీలిస్తే, గుండె గుభేల్మనక మానదు. కాగితం మీద చూపించిన అంచనా ఆదాయానికి, వాస్తవంగా ఖజానాకు చేరిన సొమ్ముకు మధ్య ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా కనిపిస్తోంది. పన్ను ఆదాయం, పన్నేతర రాబడులు, చివరకు కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు ఇలా మూడు ప్రధాన మూలాల్లోనూ అంచనాలు తలకిందులయ్యాయి. ఇది కేవలం ఒక్క సంవత్సరంలో వచ్చిన తాత్కాలిక ఒడిదుడుకు కాదు. ఇది రాష్ట్ర ఆర్థిక పునాదుల్లో కదులుతున్న నిర్మాణాత్మక భూకంపం అని ఆర్థిక రంగ నిపుణులు బాహాటంగానే హెచ్చరిస్తున్నారు.

**అతిగా ఊహించుకున్న పన్నుల పండుగ!**

రాష్ట్ర పాలకులు ప్రతి ఏటా బడ్జెట్ రూపొందించేటప్పుడు వాణిజ్య పన్నులు , స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఎక్సైజ్ ఆదాయంపై అపరిమితమైన, అవాస్తవికమైన అంచనాలు వేస్తూ వచ్చారు. ఒకప్పుడు హాట్ కేకుల్లా అమ్ముడైన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు తీవ్ర మందగమనాన్ని ఎదుర్కొంటోంది. దీంతో స్టాంప్ డ్యూటీ ఆదాయం దారుణంగా పడిపోయింది. నిర్మాణ రంగాన్ని నమ్ముకున్న అనుబంధ పరిశ్రమలు కూడా ఉపాధి కోల్పోయి ఒత్తిడిలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతున్నా, తెలంగాణకు వచ్చే వాటా మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. జాతీయ స్థాయి విభజన సూత్రాలు పెద్ద రాష్ట్రాలకే పెద్దపీట వేయడం మనకు గొడ్డలిపెట్టుగా మారింది.

**ఆరు లక్షల కోట్ల అప్పుల ఊబి.. ఊపిరాడని వడ్డీలు!**

తెలంగాణ ఆవిర్భవించిన నాడు మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం.నేడు అప్పుల కుప్పగా మారింది. కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి మహాత్వాకాంక్ష పథకాల కోసం గత పాలకులు విచ్చలవిడిగా అప్పులు తెచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర మొత్తం రుణ భారం దాదాపు ఆరు లక్షల కోట్ల రూపాయలు దాటిందని అంచనా. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, మనం సంపాదించే ఆదాయంలో 15 నుండి 18 శాతం కేవలం వడ్డీలు కట్టడానికే సరిపోతోంది. ఈ వడ్డీల భారం రాష్ట్ర దైనందిన పరిపాలనను, కొత్త అభివృద్ధి పనులను పూర్తిగా పడకేసేలా చేస్తోంది.

**ఢిల్లీ దయ తక్కువ.. కేంద్ర-రాష్ట్ర విభజన ముసుగులో అన్యాయం!**

15వ ఆర్థిక సంఘం నిర్ణయించిన నిధుల కేటాయింపుల్లో తెలంగాణ లాంటి ప్రగతిశీల చిన్న రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగిందనేది నగ్న సత్యం. జనాభా ప్రాతిపదికన నిధులు పంచే కేంద్ర లెక్కలు, జనాభాను నియంత్రించిన తెలంగాణకు శాపంగా మారాయి. పైగా, కేంద్ర ప్రాయోజిత పథకాల రూపురేఖలు మారిపోయాయి. ఒకప్పుడు వంద శాతం కేంద్రమే భరించే పథకాలను ఇప్పుడు 60:40 నిష్పత్తికి మార్చేశారు. అంటే రాష్ట్రం తన సొంత జేబు నుంచి 40 శాతం పెట్టుకోవాలి. ఇది రాష్ట్ర ఖజానాపై మోయలేని అదనపు భారాన్ని మోపింది.

**ఎన్నికల గాలాలు.. ఆర్థిక క్రమశిక్షణ లేని సంక్షేమ పథకాలు!**

రైతు బంధు (ప్రస్తుత రైతు భరోసా), ఆసరా పెన్షన్లు, దళిత బంధు, రుణమాఫీ వంటి పథకాలు ఓట్ల పండగను తెచ్చిపెట్టాయేమో కానీ, ఆర్థిక వ్యవస్థను మాత్రం కుంగదీశాయి. ప్రజా సంక్షేమం మంచిదే, కానీ ఆదాయ వనరులను చూసుకోకుండా, గ్యారంటీల పేరుతో ఆర్థిక సామర్థ్యానికి మించిన వాగ్దానాలు చేయడం దూరదృష్టి లేని పరిపాలనకు అద్దం పడుతోంది. ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా ఒకేసారి ఇన్ని ఉచిత పథకాలు గుమ్మరించడం వల్లే నేడు జీతాలు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం అడ్వాన్సుల కోసం వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

**ఐటీ మందగమనం, రాజకీయ సందిగ్ధత!**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా హైదరాబాద్ ఐటీ రంగంపైనే ఆధారపడటం ఒక పెద్ద లోపం. అంతర్జాతీయంగా ఐటీ కంపెనీలలో లేఆఫ్‌లు, నియామకాల నిలిపివేత ప్రభావం ఇక్కడి ఉద్యోగుల కొనుగోలు శక్తిని తగ్గించింది. ఇది పరోక్షంగా ప్రభుత్వ పన్నుల ఆదాయాన్ని దెబ్బతీసింది. దీనికి తోడు, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితి, ప్రభుత్వం మారిన తర్వాత పాత ప్రాజెక్టులపై తీసుకుంటున్న నిర్ణయాలు పెట్టుబడిదారులలో ఒకవిధమైన సందిగ్ధతను, అపనమ్మకాన్ని సృష్టించాయి. పాలసీలలో నిరంతరత లేకపోవడం పెట్టుబడుల వెల్లువకు బ్రేకులు వేసింది.

**కాగ్ అక్షింతలు.. నిధుల మళ్లింపులో పారదర్శకత లోపం!**

బడ్జెట్ వెలుపల చేసిన అప్పులు, నిధుల దుర్వినియోగంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలు పదే పదే మొట్టికాయలు వేస్తూనే ఉన్నాయి. ప్రజాధనం ఎటు పోతుందో, ఏ పథకానికి ఎంత ఖర్చవుతుందో తెలియని పారదర్శకత లేని పాలన నడిచింది. పన్ను చెల్లింపుదారుల సొమ్ముకు జవాబుదారీతనం లేనప్పుడు, ఎంత ఆదాయం వచ్చినా అది బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. ఈ అంతర్గత లీకేజీలు ఆదాయ లోటును మరింత తీవ్రతరం చేశాయి.

**పరిష్కారాల దిశగా.. సరికొత్త ప్రస్థానం!**

ఈ సంక్షేమ సుడిగుండం నుండి తెలంగాణ బయటపడటం అసాధ్యమేమీ కాదు. కానీ దానికి పాలకులకు గట్టి సంకల్పం, వ్యూహాత్మక ఆలోచన కావాలి. కేవలం హైదరాబాద్ చుట్టూనే కాకుండా వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ, మానుఫాక్చరింగ్, టూరిజం రంగాలను విస్తరించాలి. సంక్షేమ పథకాల్లో అర్హులకే లబ్ధి చేకూరేలా వడపోత పట్టాలి. ఉచితాల కంటే ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి, కేంద్రం నుండి రావలసిన జీఎస్టీ బకాయిలు, గ్రాంట్ల సాధనకై ఫెడరల్ స్ఫూర్తితో పోరాడాలి.

**నిజాన్ని చూసే ధైర్యం చేద్దాం!**

తెలంగాణ ఆదాయ తగ్గుదలను కేవలం ఒక పార్టీ వైఫల్యంగానో, లేదా కేంద్ర ప్రభుత్వ వివక్షగానో ముద్ర వేసి చేతులు దులుపుకుంటే అది సత్యానికి ద్రోహం చేసినట్లే అవుతుంది. ఇది దశాబ్ద కాలంగా జరిగిన పరిపాలనా లోపాలు, తప్పుడు ఆర్థిక అంచనాలు, అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల మిశ్రమ ఫలితం.పరిపాలనా పగ్గాలు ఏ పార్టీ చేతిలో ఉన్నా ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకత లేకపోతే రాష్ట్ర ప్రగతి కుంటుపడుతుంది. నాడు ఉద్యమించి సాధించుకున్న సాకారం నేడు అప్పుల ఊబిలో కూరుకుపోకూడదు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలు మెరుగైన, సుస్థిరమైన పాలనను పొందే హక్కును కలిగి ఉన్నారు. ఆ హక్కుల సాధనకు, తెలంగాణ ఆర్థిక పునర్నిర్మాణానికి నిష్పక్షపాత విశ్లేషణే తొలి అడుగు కావాలి!



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

## ఎడిటర్ వాయిస్

# వీ ఫర్ వర్మ.. ఆర్ ఫర్ రాధా.. వెయిటింగ్ లిస్టు కంటిన్యూ!

ఇక వంగవీటి రాధా అయితే 2024 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ చేయాలనుకున్నారు. తెలుగుదేశం పార్టీలో ఇద్దరు ఆశావహుల పేర్లు ప్రతీ సారీ వినిపిస్తూ ఉంటాయి. ఏదైనా నామినేట్ పదవుల భర్తీ జరిగినపుడు కానీ లేదా పెద్దల సభకు ఎన్నికలు జరిగినపుడు కానీ ఈ ఇద్దరు సీనియర్ నేతల పేర్లు చర్చకు వస్తూంటాయి. వారే వంగవీటి రాధాక్రిష్ణ అలాగే ఎస్వీఎస్ ఎన్ వర్మ. అలియాస్ పిఠాపురం వర్మ. ఈ ఇద్దరికీ 2024 ఎన్నికలో అసెంబ్లీ లేదా పార్లమెంట్ టికెట్లను పార్టీ సర్దుబాటు చేయలేకపోయింది. దానికి కారణం మూడు పార్టీల పొత్తుతో కూటమి ఏర్పాటు కావడమే. అలా త్యాగం చేసిన వీరు తమ పార్టీ విజయం కోసం అధినాయకత్వం సూచనల మేరకు ఎంతోగానో కష్టించి పనిచేశారు. కూటమి అభ్యర్థులకు విజయాన్ని చేకూర్చడంతో తమ వంతుగా కృషి చేసి సక్సెస్ అయ్యారు.

రాధాకు నిరాశ : ఇక వంగవీటి రాధా అయితే 2024 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ చేయాలనుకున్నారు. కానీ అక్కడ సీనియర్ నేత బోండా ఉమా ఉండడంతో ఆయనకు టికెట్ ఇచ్చారు. అలా రాధాకు కొంత నిరాశ కలిగింది. అయితే పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ లేదా మరే అవకాశం అయినా ఇస్తామని హామీ ఇచ్చారు. ఇక ఎమ్మెల్సీ పదవులు అయితే కూటమి ప్రభుత్వంలో అరడజన్ దాకా భర్తీ అయ్యాయి కానీ రాధాకు చాన్స్ దక్కలేదు. దాంతోనే ఆయన అనుచరవర్గం డీలా పడింది అని అంటున్నారు. తమ నాయకుడు ఎమ్మెల్సీ అయి ఆ మీదట మంత్రి కూడా అవుతారు అని అనుకున్న వారికి ఇది కొంత కలత చెందే అంశగా మారింది. మరో వైపు చూస్తే రాజ్యసభ సీటు ఒకటి రాధాకు కన్ ఫర్మ్ చేసారు అని కూడా ప్రచారం గత కొంతకాలంగా జరుగుతూ వచ్చింది. టీడీపీకి మూడు రాజ్యసభ సీట్లు ఈసారి వచ్చాయి. కానీ ఏ దశలోనూ రాధా ప్రస్తావన లేకుండా పోయింది అని గుర్తు చేస్తున్నారు.

వర్మకు వరం లేదా : అదే విధమైన సన్నివేశం పిఠాపురం వర్మ విషయంలోనూ జరుగుతోంది అని అంటున్నారు. ఆయన కూడా 2024 ఎన్నికల్లో కచ్చితంగా పిఠాపురం నుంచి పోటీ చేసి గెలవాలని అనుకున్నారు. దానికి తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే తీరా ఎన్నికలు దగ్గర పడిన తరువాత ఆయన సీటుని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కోరుకున్నారు. అలా పవన్ కి పిఠాపురం కన్ ఫర్మ్ కావడంతో వర్మకు కూడా ఎమ్మెల్సీ ఇస్తామని ప్రామిస్ చేశారు పెద్దలు. కానీ ఈ రోజు దాకా అలాంటిది ఏదీ లేకపోగా ఒక ఎమ్మెల్సీ పదవిని నాగబాబుకు ఇవ్వడం కూడా వర్మ వర్గీయులకు కొంత అసంతృప్తిని రేకెత్తించింది అని అంటున్నారు. ఇటీవల వర్మని పిఠాపురం ఇంచార్జి పదవి నుంచి కూడా తప్పించేశారు. దాంతో ఆయన అనుచరులు మరింతగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆశలన్నీ అక్కడికే : అయితే ఈ ఇద్దరి నేతల విషయం టీడీపీ పెద్దల పరిశీలనలో ఉందని అంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్ళు మాత్రమే అయింది అని అంటున్నారు. వచ్చే ఏడాది అంటే 2027లో ఏకంగా 18 దాకా ఎమ్మెల్సీ సీట్లు ఏపీలో ఖాళీ అవుతున్నాయని అందులో నుంచి కచ్చితంగా రెండు సీట్లు ఒకటి రాధాకు



ఒకటి వర్మకు దక్కే సూచనలు ఉన్నాయని కూడా అంటున్నారు. ఈ ఇద్దరూ పార్టీకి చేసిన సేవను దృష్టిలో ఉంచుకుని కచ్చితంగా తగిన న్యాయం చేస్తారని కూడా అంటున్నారు. మొత్తానికి చూస్తే ఉందిలే మంచి కాలం అని ఈ నేతలు ఇద్దరూ వారి అనుచరులు ప్రస్తుతానికి పాడుకోవడమే అని అంటున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




వెంకట కామేష్ అరాచకాలు..

## బాధితులుంటే ఫిర్యాదు చేయండి : పోలీసులు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మ్యాట్రిమోని సైట్లలో రిజిస్టర్ చేసుకుని.. యువతులను రూ.కోట్లలో మోసం చేస్తున్న వెంకట కామేష్ కేసులో బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పోలీసుల దర్యాప్తులో అతని అరాచకాలు ఒక్కోటిగా వెలుగులోకి వస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన వెంకట కామేష్‌పై తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 18 కేసులు నమోదయ్యాయి. మోసపోయిన వారంతా ఐటీ ఉద్యోగులే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రూ.200 కోట్ల సంపన్నుడిగా నమ్మించి యువతుల నుంచి డబ్బులు వసూలు చేసిన కామేష్.. బెట్టింగ్, గేమింగ్ ఆడుతున్నాడని చెప్పారు. ఫామ్‌హౌస్ పని వాళ్లకు డబ్బులు ఇచ్చి యజమానిగా చెప్పుకొనేవాడని తెలిపారు. ఇటీవల ఓ యువతి ఫిర్యాదుతో కామేష్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేయగా.. పీటీ వారెంట్‌పై మచిలీపట్నం పోలీసులు అతడిని అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే తమని సంప్రదించాలని.. నిందితుడిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తామని సైబరాబాద్ సైబర్ క్రైం డీసీపీ సాయి మనోహర్ తెలిపారు.

లైంగిక దాడికి యత్నించాడు..

## ప్రతిఘటించడంతో పైనుంచి తోసేశాడు..

**ఖమ్మం నగరంలో దారుణ ఘటన**

**నాలుగో అంతస్తు నుంచి పడటంతో తీవ్రంగా గాయపడిన 12 ఏళ్ల బాలిక - నిందితుడి అరెస్టు**



**ఖమ్మం నేరవిభాగం, విశ్వం వాయిస్ న్యూస్ :** తండ్రి వయసున్న వ్యక్తి, 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించడమే కాకుండా.. ప్రతిఘటించిందనే కారణంతో నిర్దాక్షిణ్యంగా భవనంపై నుంచి తోసేసి.. చంపేందుకు యత్నించాడు. తీవ్ర గాయాలపాలైన బాధితురాలు స్పృహలోకి వచ్చి జరిగిన దారుణాన్ని వివరించడంతో ఈ నెల 6న ఖమ్మంలో జరిగిన అమానవీయ ఘటన వెలుగులోకి వచ్చింది. ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి కథనం ప్రకారం... ఖమ్మం గ్రామీణ మండలానికి చెందిన బాలిక(12) జిల్లాలోని గురుకులంలో ఏడో తరగతి చదువుతోంది. వేసవి సెలవుల నేపథ్యంలో పది రోజుల క్రితం ఖమ్మంలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో పనిచేస్తున్న అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఈ నెల 6వ తేదీ సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో భవనం టెర్రస్‌పైకి వెళ్తున్న బాలికను... అదే భవనంలో రెండో అంతస్తులో నివసిస్తున్న డ్రైవర్ మహమ్మద్ గౌస్‌పాషా(45) అనుసరించాడు. నాలుగో అంతస్తుకు వెళ్లాక బాలికను బలవంతంగా ఖాళీగా ఉన్న ఓ ఫ్లాట్‌లోకి లాక్కెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతోపాటు కేకలు వేయడంతో విషయం బయటకు పొక్కుతుందని భావించిన అతడు... ఆమెను నాలుగో అంతస్తు నుంచి కిందకు తోసేశాడు. నేరుగా ప్రహరీపై పడటంతో తీవ్ర గాయాలపాలై..అపస్మారక స్థితిలో పడి ఉన్న బాలికను బంధువులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఈ నెల 8వ తేదీ సాయంత్రం స్పృహలోకి వచ్చిన బాధితురాలు... జరిగిన దారుణాన్ని వివరించిన మీదట బాలిక తండ్రి ఖమ్మం రెండో పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. 'ఫిర్యాదు అందిన రోజు రాత్రే నిందితుడు గౌస్‌పాషాపై పోక్సో, హత్యాయత్నం కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాం. అమ్మమ్మ ఇంటికి వచ్చిన రోజు నుంచే గౌస్‌పాషా వేధిస్తున్నట్లు, కనిపించిన ప్రతిసారీ అసభ్యకరంగా తాకుతూ ఇబ్బంది పెట్టినట్లు బాధితురాలు విచారణలో తెలిపింది' అని ఏసీపీ రమణమూర్తి వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచామన్నారు. పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో మంగళవారం న్యాయమూర్తి బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

**పొంగులేటి పరామర్శ.. బాధితురాలు హైదరాబాద్‌కు తరలింపు**

బాలిక వెన్నెముక రెండుచోట్ల, పక్కటెముకలు, ఒక కాలు, భుజం భాగంలో విరిగినట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఘటనపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం బాధితురాలిని నిమ్స్‌కు తరలించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం బాధితురాలిని హైదరాబాద్‌కు తరలించారు. స్థానిక రాజకీయ నాయకులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, వామపక్షాల నేతలు పెద్ద ఎత్తున ఆసుపత్రికి తరలివచ్చారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ ఆందోళనకు దిగారు. నిందితుడు గౌస్‌పాషా డ్రైవర్‌గా పనిచేయడంతోపాటు పలు విషయాల్లో దళారీగా వ్యవహరిస్తాడని సమాచారం. ఈ నేపథ్యంలో అతడిని రక్షించేందుకు నగరపాలక సంస్థకు చెందిన ముగ్గురు మాజీ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకునే ప్రయత్నం చేసినట్లు..కేసు తీవ్రతను పోలీసులు చెప్పటంతో వెనక్కి తగ్గినట్టు సమాచారం. చివరికి పోలీసులు నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.

అనుమానంతో భార్యను

## తుపాకీతో కాల్చి చంపిన స్థిరాస్తి వ్యాపారి



**మల్కాజిగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓ స్థిరాస్తి వ్యాపారి అనుమానంతో భార్యను తుపాకీతో కాల్చి చంపిన ఘటన హైదరాబాద్ మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న అరుణ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మాట్లాడుకుందామని చెప్పి మరో వ్యక్తితో కలిసి తెల్లవారుజామున ఇంటికి వచ్చిన అరుణ్.. భార్య నిషారాణిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. కాల్పుల శబ్దం విన్న స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొదటి భార్యకు విడాకులిచ్చిన అరుణ్ కుమార్.. ఆమె సోదరిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. 3 నెలల క్రితం అంబర్‌పేటలో వాహన తనిఖీలు చేస్తుండగా.. అరుణ్‌కుమార్ తుపాకీతో పోలీసులకు చిక్కాడు. తుపాకీ సీజ్ చేయడంతో పాతబస్తీకి చెందిన స్నేహితుల ద్వారా మరో తుపాకీ కొనుగోలు చేసి దారుణానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు.

## పోలీసులపై గంజాయి స్మగ్లర్ల రాళ్ల దాడి

**గాల్లోకి కాల్పులు**

**చింతపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి జిల్లాలో అంతర్జాతీయ గంజాయి ముఠా రెచ్చిపోయింది. తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులపై రాళ్ల దాడికి దిగింది. దీంతో పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. చింతపల్లి మండలం అన్నవరం స్టేషన్ పరిధిలోని లోతుగెడ్డ సమీపంలో ముందస్తు సమాచారంతో ఇవాళ తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గంజాయితో వస్తున్న కారును తనిఖీ చేస్తుండగా.. అందులో ఉన్న ముఠా సభ్యులు.. హెడ్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకున్నారు. అంతటితో ఆగకుండా పోలీసులపై రాళ్లతో దాడికి దిగారు. దీంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరపడంతో.. నిందితులు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా.. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌కు చెందిన వారిగా గుర్తించారు. కారులో ఉన్న 290 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

## టైర్ పేలి అదుపుతప్పిన కారు..



**ఐదుగురికి స్వల్ప గాయాలు**

**చిలకలూరిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ నుండి సూర్యలంక బీచ్‌కు వెళ్తున్న షిఫ్ట్ డిజైర్ కారు పసుమర్రు గ్రామ మలుపు వద్ద టైర్ పేలడంతో అదుపుతప్పి పక్కకు పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా, పేట రూరల్ పోలీసులు వెంటనే స్పందించి బాధితులను 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని ప్రాథమికంగా తెలిసింది. ప్రమాదానికి సంబంధించి మరిన్ని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పట్టపగలు తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

**గద్వాల, విశ్వం వాయిస్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని భీమ్ నగర్ కాలనీలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఒక ఇంట్లోకి చొరబడిన దొంగలు పెద్దఎత్తున బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. స్థానికంగా నివసించే మహ్మద్ రహ్మత్ పాషా ఉదయం 10:45 గంటల ప్రాంతంలో తన విధుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు.. ఇంట్లోని బీరువా పగలగొట్టి అందులో ఉన్న సుమారు 12 తులాల బంగారు, 60 తులాల వెండి, నగదు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో రహ్మత్ పాషా తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి, వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే దొంగలు ఈ భారీ చోరీకి పాల్పడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# మూడేళ్లకోసారి వచ్చే ఈ అరుదైన ఏకాదశి రోజున ఇలా పూజిస్తే.. లక్ష్మీకటాక్షం మీ సొంతం!

మూడు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే వచ్చే పరమ ఏకాదశి అత్యంత పవిత్రమైన, అరుదైన ఏకాదశిగా పరిగణించబడుతుంది. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల పాప విమోచనం, ఐశ్వర్యం, మనశ్శాంతి, వైకుంఠ ప్రాప్తి వంటి విశేష ఫలితాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. పరమ ఏకాదశి పూజా విధానం, వ్రత నియమాలు, మహిమ గురించి తెలుసుకోండి. హిందూ సంప్రదాయంలో ఏకాదశి వ్రతానికి ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. సాధారణంగా ఒక సంవత్సరంలో 24 ఏకాదశులు వస్తాయి. అయితే అధిక మాసం వచ్చిన సంవత్సరాల్లో కొన్ని ప్రత్యేక ఏకాదశులు కూడా వస్తాయి. వాటిలో అత్యంత పవిత్రమైనది, అరుదైనది 'పరమ ఏకాదశి'. ఈ ఏకాదశి ప్రతి సంవత్సరం రాకుండా, సాధారణంగా మూడు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధిక మాసంలో మాత్రమే వస్తుంది. అందుకే దీనిని అత్యంత విశిష్టమైన, అద్భుతమైన ఏకాదశిగా పరిగణిస్తారు. గ్రహాలు, చంద్రుని గమనాల ఆధారంగా ఏర్పడే ఈ పరమ ఏకాదశి, పాప విమోచనం, ఐశ్వర్య ప్రాప్తి, ఆధ్యాత్మిక శ్రేయస్సు, మోక్షాన్ని ప్రసాదించే మహత్తరమైన వ్రతంగా పురాణాలు పేర్కొంటున్నాయి.

**పరమ ఏకాదశి వ్రతం వల్ల కలిగే ప్రయోజనాలు**

పురాణాల ప్రకారం, సంపదకు అధిపతిగా ప్రసిద్ధి చెందిన 'కుబేరుడు' పరమ ఏకాదశి వ్రతాన్ని ఆచరించడం వల్లనే దేవతల ఖజానాను నిర్వహించే మహోన్నత స్థానం పొందాడని చెబుతారు. అలాగే సత్యవ్రతానికి ప్రతీకగా నిలిచిన 'హరిశ్చంద్ర మహారాజు', తన రాజ్యం, సంపద, కుటుంబం సహా సర్వస్వం కోల్పోయిన సమయంలో ఈ వ్రతాన్ని ఆచరించి, తిరిగి తన వైభవాన్ని పొందాడని పురాణ కథనాలు వివరిస్తున్నాయి. మత గ్రంథాల ప్రకారం, పరమ ఏకాదశి రోజున భక్తిశ్రద్ధలతో ఉపవాసం ఉండి, మహావిష్ణువును, మహాలక్ష్మీదేవిని పూజిస్తే 'అశ్వమేధ యజ్ఞం చేసినంత పుణ్యఫలం' లభిస్తుందని విశ్వసిస్తారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి ఈ వ్రత మహిమను వివరిస్తూ, పరమ ఏకాదశిని భక్తితో ఆచరించిన




వారికి విష్ణులోకం లేదా వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని చెప్పినట్లు పురాణాలు పేర్కొంటాయి.

**ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల:**

మనశ్శాంతి లభిస్తుంది, ప్రతికూల శక్తులు తొలగిపోతాయి, జీవితంలో స్థిరత్వం పెరుగుతుంది, ఆర్థిక అభివృద్ధికి మార్గాలు తెరుచుకుంటాయి, ఆధ్యాత్మిక చైతన్యం పెరుగుతుంది, పాపాల నుంచి విముక్తి లభిస్తుందని విశ్వసిస్తారు

పరమ ఏకాదశి ఉపవాస విధానం

భక్తులు తమ ఆరోగ్య పరిస్థితిని బట్టి ఉపవాసాన్ని ఆచరించవచ్చు.

పూర్తి ఉపవాసం చేస్తూ రోజంతా కేవలం నీరు మాత్రమే తీసుకోవచ్చు.

పండ్లు, పాలు తీసుకుంటూ ఫలాహార ఉపవాసం చేయవచ్చు.

ఆరోగ్య కారణాల వల్ల కఠిన ఉపవాసం చేయలేని వారు ఒక పూట సాత్వికాహారం తీసుకోవచ్చు.

**పూజా విధానం**

ఉపవాసానికి ముందు రోజు (జూన్ 10) రాత్రి నుంచి నియమ నిష్ఠలను పాటించడం మంచిది.

జూన్ 11 ఉదయం బ్రహ్మముహూర్తంలో లేచి స్నానం చేసి వ్రత సంకల్పం చేయాలి.

ఇంట్లో శ్రీమహావిష్ణువు లేదా పెరుమాళ్ చిత్రపటం ముందు నెయ్యి దీపం వెలిగించాలి.

విష్ణుమూర్తికి పసుపు రంగు పువ్వులు, మహాలక్ష్మీదేవికి ఎరుపు రంగు పువ్వులు సమర్పించాలి.

తులసి దళాలు, పండ్లు, మిఠాయిలను నైవేద్యంగా సమర్పించి హారతి ఇవ్వాలి.

"ఓం నమో భగవతే వాసుదేవాయ" మంత్రాన్ని కనీసం 108 సార్లు జపించాలి.


రోజంతా విష్ణు నామస్మరణ, భజనలు, పురాణ పారాయణం చేయడం శుభప్రదంగా భావిస్తారు.

**పారణ ఎప్పుడు చేయాలి?**

ఏకాదశి ఉపవాసాన్ని మరుసటి రోజు వచ్చే 'ద్వాదశి తిథిలో' పారణ చేసి ముగించాలి. శాస్త్రోక్త సమయాన్ని అనుసరించి ద్వాదశి తిథిలో నిర్ణీత సమయంలో ఆహారం స్వీకరించడం ద్వారా వ్రతం సంపూర్ణ ఫలితాన్ని ఇస్తుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. మూడు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే లభించే ఈ అరుదైన పరమ ఏకాదశి, భక్తులకు ఆధ్యాత్మిక పురోగతి, ఐశ్వర్యం, దైవానుగ్రహాన్ని ప్రసాదించే మహోన్నతమైన వ్రతంగా భావించబడుతోంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

గురువారం, 11 జూన్, 2026




# కోరుకొండలో ఘనంగా 'విశ్వం వాయిస్' కుటుంబ సభ్యులు ఆత్మీయ కలయిక

### పత్రిక పరిజ్ఞానానికి పరీక్ష- పలువురికి చిరు సత్కారాలు - సరస్వతి విద్యానికేతన్ అధినేత గంగాధర్‌కు కృతజ్ఞతలు







**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ సరస్వతి విద్యా నికేతన్‌లో విశ్వం వాయస్ నాలుగు జిల్లాల కుటుంబసభ్యుల ఆత్మీయ కలయిక కోరుకొండ రిపోర్టర్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ లో నిర్వహించిన విశ్వం వాయస్ ఆత్మీయ కలయికకు సంస్థ అధినేత సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ సమాజానికి ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడుతున్న పత్రికారంగం అన్ని విధాల కుంటుపడుతుందని, పత్రికారంగాన్ని సక్రమంగా నడిపించవలసిన బాధ్యత పోలీస్, రాజకీయ,న్యాయ వ్యవస్థతో పాటు ప్రతి రిపోర్టర్ కి ఉందన్నారు. ప్రతి పాత్రికేయుడు మారుతున్న వ్యవస్థకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని, బాధితుల తరఫున భరోసాగా నిలవాలన్నారు. ప్రతి పాత్రికేయుడు నిత్య విద్యార్థి అని, మారుతున్న కాలానికి అనుగుణంగా సమస్యలపై అవగాహన పెంపొందించుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ అధినేత పెనకటి గంగాధర్ గ్రామీణ స్థాయిలో పేద విద్యార్థులకు ఐఐటి విద్యతో పాటు తక్కువ ఫీజులతో విద్యను అందించడం, రాజమహేంద్రవరం జిల్లా వ్యాప్తంగా లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవ కార్యక్రమాల పురస్కరించుకొని విశ్వం వాయిస్ అధినేత సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గంగాధర్ కు పూలమాలవేసి సాల్వో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా నేటి సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పాత్రికేయులు పత్రిక రంగంపై విలువలతో కూడిన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నిస్తూ, బాధితులు తరఫున భరోసాగా నిలవాలన్నారు. అనంతరం తూర్పుగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పోలవరం జిల్లాల స్టాఫ్ రిపోర్టులను పూలమాల వేసి సాల్వో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధినేత సునీల్ కుమార్, సబ్ ఎడిటర్ చంద్ర, నాలుగు జిల్లాల స్టాఫ్ రిపోర్టర్ రత్న కిషోర్, గోవింద్, వెంకటేష్, చిట్టిబాబు, ఆయా జిల్లాల రిపోర్టర్లు పాల్గొన్నారు.

### '1/3' చిత్ర వీడియో సాంగ్‌ను

# విడుదల చేసిన మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ప్రతిభను ప్రోత్సహిస్తూ, సరికొత్త సామాజిక సందేశంతో తెరకెక్కిన '1/3'(వన్ బై థర్డ్) చలనచిత్రం చిత్ర పరిశ్రమలో ఆసక్తి రేకెత్తిస్తోంది.ఎస్ ఎస్ ఎస్ నిర్మాణ సంస్థ, షణ్ముఖ క్రియేషన్స్ సహనిర్మాణం సంస్థగా రూపొందించిన చిత్రానికి సంబంధించిన ఫుల్ వీడియో సాంగ్‌ను బుధవారం ఉదయం రాష్ట్ర సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తన చేతుల మీదుగా అధికారికంగా విడుదల చేశారు. 'శబరి మ్యూజిక్' యూట్యూబ్ ఛానల్ ద్వారా ఈ పాట ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి, ముఖ్యంగా చిన్న చిత్రాల మనుగడకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందన్నారు. "పరిశ్రమకు కొత్త రక్తం, కొత్త ఆలోచనలు ఎంతో అవసరం. '1/3' లాంటి వైవిధ్యభరితమైన కథాంశాలతో వచ్చే చిన్న చిత్రాలను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుంది. ఈ చిత్రం ఘన విజయం సాధించి, ఇందులో పనిచేసిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు టాలీవుడ్‌లో మరిన్ని మంచి అవకాశ రావాలి సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికందుల దుర్గేష్ పేర్కొన్నారు. అన్ని వయసుల వారిని ఆకట్టుకునే 'యూనివర్సల్ మెసేజ్'చిత్ర దర్శకుడు సాయి మహేష్ మాట్లాడుతూ.. ఈ చిత్రాన్ని ఒక బలమైన సోషల్ మెసేజ్‌తో రూపొందించామని, సమాజంలోని అన్ని వర్గాల, అన్ని వయసుల ప్రేక్షకులను ఆలోచింపజేసే ఒక 'యూనివర్సల్ పాయింట్' ఇందులో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కనెక్ట్ అయ్యేలా వినోదాత్మకంగా ఈ కథను తెరకెక్కించినట్లు ఆయన పేర్కొన్నారు.గోదావరి పరిసరాల్లో నిర్మాణం.. త్వరలోనేథియేటర్లు,ఓటీటీల్లో విడుదలచిత్ర సహ దర్శకుడు డి.ఎస్.ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ లోకల్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేయాలనే సంకల్పంతో సరికొత్త నటీనటులతో ఈ చిత్రాన్ని నిర్మించామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని పలు మనోహరమైన ప్రాంతాలలో ఈ చిత్ర షూటింగ్ జరిపినట్లు వెల్లడించారు. సాంకేతిక నిపుణులైన వినోద్ (కెమెరామెన్), అసద్.జె (మ్యూజిక్ డైరెక్టర్), శ్యామ్ (ఎడిటింగ్, డి.ఐ, ఎస్ఎఫ్ఎక్స్)ల అద్భుతమైన సహకారంతో ఔట్‌పుట్ చాలా బాగా వచ్చిందని వివరించారు. త్వరలోనే ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని థియేటర్లతో పాటు, ఒక ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఒకేసారి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. మంచి చిత్రాలను గుండెల్లో పెట్టుకునే తెలుగు ప్రేక్షకులు తమ ప్రయత్నాన్ని ఆదరిస్తారని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించిన నటులు మహేశ్ తేజ, వెంకటేష్ ముత్యాల, దీపక్, నాని తదితరులు పాల్గొని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

### పేదలకు కొండంత భరోసా

# 'ముఖ్యమంత్రి సహాయ నిధి'

**ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి చేతులమీదుగా రూ.6,86,812/- విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**


**19 మంది లబ్ధిదారులకు అందిన ఆర్థిక సాయం - కూటమి ప్రభుత్వంలో వివక్ష లేని పాలన: ఎమ్మెల్యే స్పష్టం**



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆపదలో ఉన్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత భరోసాగా నిలుస్తుందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడ వరం ఎమ్మెల్యే మిరి యాల శిరీషాదేవి అన్నా రు. బుధవారం రంపచోడ వరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 19 మంది లబ్ధిదారులకు రూ. 6,86,812/- విలువైన చెక్కులను ఆమె చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ గత ప్రభుత్వాల కంటే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మరింత మెరుగ్గా, ఎక్కువ మొత్తంలో నిధులను నిరుపేదల కోసం తీసుకువస్తోందని స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో కేవలం వారి సానుభూతిపరులకే ఈ సహాయం పరిమితమైందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎలాంటి పార్టీ, కుల, మత, వర్గ బేధాలు లేకుండా వైద్య సహాయం అవసరమైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సాయం అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటూ, "ఇంకా నేనేమైనా సహాయం చేయాలా?" అంటూ భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే చొరవపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. తమలాంటి అభాగ్యులకు ఈ కష్టసమయంలో ప్రభుత్వం చేసిన ఆర్థిక సాయం మరువలేనిదని వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, గురుకు శేషు కుమార్, రంపచోడవరం మాజీ సర్పంచ్ వై. నిరంజని దేవి ఇతర కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పిచుకలపాలెం పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను అప్పగించాలి

**తహసీల్దార్ ను కలిసి వినతిపత్రం సమర్పణ - రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఆర్.కే.నాయుడు పోరాటం**




**పల్నాడు జిల్లా, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పిచుకలపాలెం గ్రామానికి చెందిన పేద కుటుంబాలకు గతంలో కేటాయించిన ఇళ్ల స్థలాలను తిరిగి అప్పగించాలని కోరుతూ పల్నాడు జిల్లా రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్.కె నాయుడు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, 1999 సంవత్సరంలో ప్రభుత్వం పిచుకలపాలెం గ్రామంలోని పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించుకునేందుకు స్థల పట్టాలను మంజూరు చేసింది. అయితే అప్పటి ఆర్థిక పరిస్థితుల కారణంగా వారు ఇళ్ల నిర్మాణం చేపట్టలేకపోయారు. ప్రస్తుతం కూడా పలువురు అద్దె ఇళ్లలో, గుడిసెలలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు.ఇటీవల ప్రభుత్వం అందిస్తున్న గృహ నిర్మాణ ఆర్థిక సహాయాన్ని వినియోగించుకుని ఇళ్లు నిర్మించుకోవాలని భావిస్తుండగా, తమకు కేటాయించిన స్థలాలను కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను గతంలోనూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు.గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఈ విషయాన్ని పల్నాడు జిల్లా రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్.కె. నాయుడు మండల తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా పల్నాడు జిల్లా రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను అక్రమంగా ఆక్రమించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. దశాబ్దాల క్రితం పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇప్పటికీ సొంత ఇల్లు కోసం ఎదురుచూస్తుండగా, వారి హక్కులను కాలరాస్తూ కొందరు వ్యక్తులు భూములను కబ్జా చేయడం సమాజానికి శోచనీయమని అన్నారు. పేదలకు న్యాయం జరగాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని, వెంటనే సంబంధిత భూములపై సర్వే నిర్వహించి అసలు లబ్ధిదారులకు వారి స్థలాలు అప్పగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మండల తహసీల్దార్ సానుకూలంగా స్పందించి విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం సంతోషకరమని పేర్కొన్నారు.పిచుకలపాలెం గ్రామ పేదలకు వారి హక్కులు పూర్తిస్థాయిలో దక్కే వరకు రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తుందని ఆర్.కె. నాయుడు స్పష్టం చేశారు. అవసరమైతే ఉన్నతాధికారులను కలిసి సమస్య పరిష్కారం కోసం ఉద్యమించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.పేదలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాలను కొందరు అక్రమంగా కబ్జా చేయడం అన్యాయమని అన్నారు.ఈ అంశంపై తహసీల్దార్‌ను సంప్రదించగా, సంబంధిత భూములపై సర్వే నిర్వహించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, అర్హులైన లబ్ధిదారులకు వారి స్థలాలు దక్కేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆర్.కె. నాయుడు తెలిపారు.పిచుకలపాలెం గ్రామ పేదలకు న్యాయం జరిగే వరకు రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల

# మహిళ మృతి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అస్వస్థత గురైందని కంచిపల్లి దేవిని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో జాయిన్ చేశారని, అయితే అర్ధరాత్రి బంధువులకు తెలియకుండానే ఆసుపత్రి యాజమాన్యం మరో ఆసుపత్రికి ఆమెను తరలించినట్లు అమలాపురం పట్టణ సీఐ వీరబాబు తెలిపారు. అప్పటికే ఆమె మృతి చెందటంతో, డాక్టర్ ఇంజక్షన్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడంతో ఆమె చనిపోయిందని బంధువుల ఆరోపణ వ్యక్తం చేశారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అమలాపురం పట్టణ సీఐ వీరబాబు దర్యాప్తు చేస్తున్నారు. గత ఏడాది కంచిపల్లి శ్రీను ను కొంతమంది హత్య చేసి పి.గన్నవరం గోదావరిలో పడవేసిన విషయం తెల్సిందే.. ఆ కేసు పై ఆమె అప్పటి నుంచి పోరాడుతునేవున్న పరిస్థితి.



# తెదేపా పార్టీ కార్యకర్తకు అండగా మంత్రి సుభాష్

## అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తకు రూ.20 వేల ఆర్థిక సహాయం

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం ఆర్యవటం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పెంకే అప్పారావు అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడికి ధైర్యం చెప్పిన మంత్రి సుభాష్, వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తల సంక్షేమం తమ బాధ్యత అని అవసరమైన సమయంలో ప్రభుత్వం మరియు పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నిత్యం అధికారిక, రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉండే మంత్రి సుభాష్ స్వయంగా తమ ఇంటికి వచ్చి పరామర్శించి, ఆర్థిక సహాయం అందించడం పట్ల పెంకే అప్పారావు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, సొసైటీ అధ్యక్షులు కోట తాతబ్బాయి, బొడ్డు నా వఇగమల్లేశ్వరరావు, సనపల ధనరాజు, కొల్లు హనుమంతరావు, గీసాల వీరభద్రరావు, చందాల బాబి, సూది కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొని కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుతున్న మంత్రి సుభాష్ సేవలను కొనియాడారు.

# ఎపి ఎఐఎంఎస్ 2.0 ద్వారానే ఎరువుల పంపిణీ: ఆర్‌డీవో ఎ.సరళవతి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎరువుల పంపిణీని AP AIMS 2.0 పోర్టల్ ద్వారా సమర్థవంతంగా నిర్వహించడంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.సరళవతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతులు, పీఏసీఎస్ సొసైటీల అధ్యక్షులు, సీఈఓలు,ప్రైవేట్ ఎరువుల డీలర్లు, నీటి సంఘాల ప్రతినిధులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ అధికారులు డీలర్లు,రైతులు ఏపీ ఎయిమ్స్ 2.0 విధానంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో రైతులకు విస్తృత ప్రచారం కల్పించాలని పంపిణీ ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత మండల వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఆమె స్పష్టం చేశారు. వ్యవసాయ సహాయ సంచాలకులు బి. నాగకుమార్ మాట్లాడుతూ సాగు చేస్తున్న వాస్తవ రైతులకు శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు సరైన సమయంలో అవసరమైన ఎరువులను అందించడమే ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ-క్రాప్ పంట నమోదులు మరియు శాస్త్రవేత్తల సిఫార్సుల ఆధారంగానే ఎరువుల పంపిణీ జరుగుతుందన్నారు. తద్వారా ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టి బ్లాక్ మార్కెట్ వాణిజ్య,ఆక్వా రంగాలకు మళ్లింపును నిరోధించవచ్చని పేర్కొన్నారు. రైతుల ఆధార్ మరియు దానికి అనుసంధానమైన మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీ ఆధారంగానే విక్రయాలు జరుగుతాయని దీనివల్ల పారదర్శకతతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని వివరించారు. రామచంద్రపురం మండల వ్యవసాయాధికారి టి.వి.ఆర్. మణిదీప్ పోర్టల్ అమలు విధానాన్ని వివరిస్తూ ప్రైవేట్ ఎరువుల డీలర్లందరూ తప్పనిసరిగా తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో మ్యాపింగ్ పూర్తి చేయించుకోవాలని సూచించారు. ఈ-పాస్ యంత్రం ద్వారా ఎరువులు పొందిన రైతుల ఆధార్ వివరాలతోనే IFMS స్టాక్ క్లియరెన్స్ నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాంత రైతులు రెండు జిల్లాల పరిధిలో వ్యవసాయం చేస్తున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మినహాయింపులు కల్పించాలని ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షులు బలుసు శివరామకృష్ణ ప్రసాద్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కె. గంగవరం మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి, ఉభయ మండలాల తహసీల్దార్లు, ప్రముఖ రైతు నాయకుల, గరికిపాటి సూర్యనారాయణ వివిధ సొసైటీల ప్రతినిధులు డీలర్లు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆర్డీవోకి అభినందనలు తెలిపిన

# టిడిపి సీనియర్ నాయకులు




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట ఆర్డీఓగా నియమితులై పదవి బాధ్యతలు చేపట్టిన కొత్తపేట ఆర్డిఓ జీవివి సత్యనారాయణను కొత్తపేట టిడిపి నాయకులు స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు సాలువ కప్పి సత్కరించారు. ఎన్నికల సమయంలో ఆర్డిఓ సత్యనారాయణ గతంలో కొత్తపేట ఆర్డీవోగా పని చేశారు.అందరికీ పరిచయస్తులయిన ఆయన తిరిగి మరల కొత్తపేట బదిలీపై రావడంతో టిడిపి నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు ధర్నాల రామకృష్ణ మిద్దె ఆదినారాయణ సిద్ధం శెట్టి సత్యనారాయణ గుబ్బల మూర్తి తదితరులు ఆర్డీవో కి అభినందనలు తెలిపారు.

### బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఈడబ్ల్యుసి నుండి

# ఎండోమెంట్‌కు మార్పు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** హర్షం వ్యక్తం చేసిన మందపల్లి ట్రస్టీ, కొత్తపేట నియోజకవర్గ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ చిల కమర్తి సావిత్రీ శ్రీనివాస్ ప్రభుత్వం ఈ రోజున ఒక ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకుంటూ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరే షన్‌ని ఈ డబ్ల్యుసి నుండి ఎండో మెంట్ డిపార్ట్మెంట్‌కు మారుస్తూ ఒక జీవో కాపీని ఈ రోజు రిలీజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడుకి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి అలాగే యువనేత లోకేష్ బాబు చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్‌కి మందపల్లి ట్రస్టీ, కొత్తపేట నియోజకవర్గ బ్రాహ్మణసాధికార సమితి కన్వీనర్ చిలకమర్తి సావిత్రి శ్రీనివాస్ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.



# చంద్రబాబుకు భారీ బాధ్యత.. మోడీ కసరత్తు పూర్తి!

ఏపీ సీఎం చంద్రబాబుకు భారీ బాధ్యతను అప్పగించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ సిద్ధమయ్యారా? అధికారికంగా.. బుధవారం ఈ విషయాన్ని ప్రకటించనున్నారా? అంటే.. ఔననే అంటున్నాయి జాతీయ మీడియా వర్గాలు. బుధ, గురువారాల్లో ఢిల్లీ వేదికగా ఎన్డీయే పార్టీ నేతల కీలక సమావేశం జరగనుంది. దీనిలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు వెళ్లనున్నారు. ఈ సందర్భంగానే చంద్రబాబుకు మోడీ కీలక బాధ్యతలు అప్పగించనున్నారని తెలుస్తోంది.




**ఏంటి విషయం..**

గత పార్లమెంటు సమావేశాల్లో మోడీ సర్కారు మహిళా రిజర్వేషన్ బిల్లు సహా.. పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తీసుకువచ్చింది. అయితే.. పార్లమెంటులో దీనిని విపక్షాలు వీగిపోయేలా చేశాయి. మహిళా రిజర్వేషన్‌కు.. నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టడం సహా.. పునర్విభజనను జనాభా ప్రాతిపదికన చేపట్టరాదని కూడా నిలదీశాయి. దీంతో ఈ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో విపక్షాలదే పైచేయి అయింది. అనంతరం.. ఈ బిల్లును ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. అయితే.. ఎలాగైనా మహిళా బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను ఆమోదించుకుని తీరాలని మోడీ సర్కారు పంతంతో ఉంది. కానీ.. ఎలా సాధించాలి? అనేదే కీలక అంశం. ఇలాంటి అనేక సందర్భాల్లో చంద్రబాబు గతంలో చక్రం తిప్పారు. వాజపేయి ప్రభుత్వంఏర్పాటు సమయంలో ఆయన అన్ని పక్షాలతో మాట్లాడి.. ఎన్డీయే కన్వీనర్‌గా వారిని ఒప్పించారు. మోడీ హయాంలో పెద్దనోట్ల రద్దు అనంతరం.. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు వేసిన కమిటీలోనూ చంద్రబాబు ఉన్నారు. ఇలా.. ఎప్పుడు అవసరమైతే. అప్పుడు చంద్రబాబు తన చక్రం అడ్డం వేసి.. కేంద్రానికి సహాయం చేస్తున్నారు. తాజాగా మహిళా బిల్లు, పార్లమెంటు నియోజకవర్గాల పెంపు అంశంపై పంతానికి పోతున్న విపక్షాలతో చర్చించి.. వారిని లైన్‌లో పెట్టే కీలక బాధ్యతలను ప్రధాని మోడీ.. చంద్రబాబుకు అప్పగించనున్నారని జాతీయ మీడియా పేర్కొంది. బుధ, గురువారాల్లో జరిగే.. ఎన్డీయే నేతల సమావేశంలో దీనిపై ప్రధానే స్వయంగా ప్రకటన చేయనున్నట్టు తెలిపింది. కాంగ్రెస్‌ను వ్యతిరేకించినా.. ఆ పార్టీతో బాబుకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అలానే ఉత్తరాది పార్టీలు కూడా..బాబును గౌరవిస్తున్నాయి. ఈ క్రమంలోనే బాబుపై మోడీ కీలక బాధ్యత పెడుతున్నారని మీడియా చెబుతోంది.

### దివ్యాంగుల సాధికారతకు

# సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ కృషి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అన్నివేళలా కృషి చేస్తుందని ఆ ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. రామచంద్రపురం టౌన్ హాల్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేదా ఇతర అవకాశాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సరైన శిక్షణ, మార్గదర్శకత్వం ఉంటే దివ్యాంగులు కూడా అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి విజయాలను సాధించగలరని పేర్కొన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఎల్లప్పుడూ సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యంగా దివ్యాంగుల సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా పాల్గొనే దివ్యాంగులు వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలను పొందడంతో పాటు చిన్న స్థాయి వ్యాపారాలు ప్రారంభించి స్వావలంబన సాధించగలరనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఏడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణలో ాబౌూ అనాలిసిస్, ఫైనల్ థెరపీ, సాఫ్ట్ థెరపీ, VIM బ్లిస్ట్ థెరపీ, వ్యాపార నిర్వహణలో మెళకువలు, వ్యక్తిత్వ వికాసం మరియు ఆత్మవిశ్వాస పెంపు అంశాలపై నిపుణులు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. దివ్యాంగుల అభ్యున్నతే సమాజ అభివృద్ధికి పునాది అని వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ట నాగేశ్వరరావు, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు కుడుపూడి ఫణి తేజ, ఏసుదాసు, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు, పలువురు దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు మరియు స్థానిక నాయకులు పాల్గొని ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.

### తెలుగుదేశం పార్టీలో చేరిన

# 60 మంది వైసీపీ కార్యకర్తలు

### మంత్రి వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యం సమక్షంలో టీడీపీలో చేరికలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ సమక్షంలో 60 మంది వైసీపీ కార్యకర్తలు బుధవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీలో చేరారు. రామచంద్రపురం గుబ్బలవారిపేటకు చెందిన దంగేటి శివకుమార్, చింతాకుల ప్రకాష్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ పార్టీ కండువాలు కప్పి వారందరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసంతోనే పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి , ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు, యువతకు ప్రోత్సాహం, మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, పారదర్శక పాలనను చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవిల్లి శివ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీలో కొత్తగా చేరిన వారిని నాయకులు అభినందించి, భవిష్యత్తులో పార్టీ విజయానికి కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు.

### నరేంద్ర మోదీ నేటితో 4399 రోజుల

# నిరంతర పాలనతో సరికొత్త రికార్డు

### మందపల్లిలో ప్రత్యేక పూజలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటితో 4399 రోజుల నిరంతర పాలనతో సరికొత్త రికార్డు సృష్టించిన సంధర్భంలో మందపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బిజెపి సీనియర్ నాయకులు కోటిపల్లి సుబ్బలక్ష్మి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం మరియు నాయకులు విచ్చేసి మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ మన దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దే క్రమంలో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన పేరుతో ఉమామందేశ్వర శనైశ్చర స్వామి వారికి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ నరేంద్ర మోడీ సుదీర్ఘ కాలం పాటు భారతదేశాన్ని పరిపాలించిన కాంగ్రెసేతర ప్రధానిగాగా 4399 రోజుల నిరంతర పాలనతో చరిత్ర సృష్టించిన ప్రజానాయకుడనీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జవహర్ లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల పద్నాలుగు రోజుల ప్రధాని పాలన రికార్డు బద్దలుకొట్టి ప్రజలద్వారా ఎన్నుకోబడి ప్రధానిగా సుదీర్ఘ కాలం పాటు దేశాన్ని పరిపాలిస్తున్న ప్రజల మనిషనీ కొనియాడారు. మోదీ హయాంలో రాజకీయ సుస్థిరత ఏర్పడి తద్వారా జీఎస్టీ,నోట్లరద్దు, డిజిటల్ ఇండియా వంటి సంస్కరణలు సాధ్యమయ్యాయనీ అంతేకాకుండా జాతీయ భద్రత పట్ల రాజీలేని వైఖరి ప్రదర్శిస్తూ ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్ రద్దు వంటి సంచలన నిర్ణయాలతో దేశ అంతర్గత రాజకీయ స్వరూపాన్ని మోడీ మార్చారని అన్నారు. అత్యాధునిక ఆయుధాలను స్వదేశీయంగా తయారు చేయించడం మరియు సమకూర్చడం ద్వారా దేశ రక్షణ పెంచారనీ,ఆర్మీ కి పూర్తి స్వేచ్ఛ నిచ్చి ఉగ్రవాదుల ఏరివేత సరిహద్దు చొరబాట్లు లేకుండా చేశారనీ అన్నారు.అటువంటి నిస్వార్ధ నాయకునికి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి మరో దశాబ్దం పాటు మోడీ పాలనలో ఈదేశం నెంబర్ 1 స్థానంలో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు భమిడిపాటి లక్ష్మి నారాయణ, బిజెపి కిసాన్ మోర్చ నాయకులు కోటిపల్లి రఘురాం వేణుగోపాల్, యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షులు కోటిపల్లి దామోదర్ తరిట్ల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ
జిల్లా ఎడిషన్

గురువారం, 11 జూన్ 2026
www.viswamvoice.com





# సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ

**న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు**

**సరైన సమయంలో, సరైన స్థానంలో దేశానికి మోదీ సరైన నాయకుడని వ్యాఖ్య - అధికారం కోసం కాకుండా, దేశ ప్రయోజనాల కోసమే ఎన్డీయే ఏర్పడిందని స్పష్టం**

**ప్రపంచ సవాళ్ల మధ్య కూడా దేశ ఆర్థిక వ్యవస్థకు మోదీ స్థిరత్వం తెచ్చారని ప్రశంస - మోదీ నాయకత్వంలోనే 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమని ధీమా**



**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** న్యూఢిల్లీలో బుధవారం జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "సరైన సమయంలో, సరైన స్థానంలో దేశానికి లభించిన సరైన నాయకుడు నరేంద్ర మోదీ" అని చంద్రబాబు అభివర్ణించారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయనకు కృతజ్ఞతా తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎల్లప్పుడూ 'నేషన్ ఫస్ట్' అనే నినాదంతో పనిచేస్తారని చంద్రబాబు కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఆర్థిక మందగమనం వంటి అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, మోదీ తన సమర్థవంతమైన పాలనతో దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని చేకూర్చారని గుర్తుచేశారు. ఆయన నాయకత్వ పటిమ వల్లే భారత్‌లో ద్రవ్యోల్బణం అదుపులో ఉందని తెలిపారు. మోదీ ఎన్నడూ అలసిపోరని, నిత్యం ఉత్సాహంగా ఉంటూ అందరిలోనూ స్ఫూర్తిని నింపుతారని ప్రశంసించారు. సాధారణంగా రాజకీయ కూటములు ఎన్నికల కోసమే ఏర్పడతాయని, కానీ ఎన్డీయే మాత్రం దేశం కోసం ఆవిర్భవించిన కూటమి అని చంద్రబాబు స్పష్టం చేశారు. కేవలం అధికారం కోసం కాకుండా దేశ ప్రయోజనాల పరమావధిగా ఎన్డీయే ప్రయాణం సాగుతోందని, వివిధ రాష్ట్రాల్లో ఈ కూటమి సాధిస్తున్న విజయాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోనే 2047 నాటికి 'వికసిత్ భారత్' నిర్మాణం సాధ్యమవుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. ప్రతి భారతీయుడి మనోభావాలను అర్థం చేసుకున్న గొప్ప నేత మోదీ అని, ఆయన నేతృత్వంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు.

# మాటలు కాదు.. చేతల్లోకి పవన్ కల్యాణ్!

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. మాటలు వదిలి చేతలు ప్రారంభించారు. గోదావరి పుష్కరాలను అత్యంత పవిత్రంగా నిర్వహించాలని నిర్ణయించిన ఆయన.. గోదావరి నదీ పరివాహక ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇటీవల రెండు రోజుల పాటు.. అక్కడే ఉండి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోదావరి ఉపనదులు, ఇతర కాల్వల్లో మురుగునీరు చేరడం,కాలుష్యం పెరగడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్యా నికి కారణాలు తెలుసుకున్నారు. దీనివెనుక ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్నారు. సోమవారం మరోసారి గోదావరి కాలుష్యంపై దృష్టి పెట్టిన పవన్ కల్యాణ్ చేతల్లోకి దిగారు. ముఖ్యంగా ఆంధ్రా పేపర్ మిల్లు నుంచి వచ్చే కాలుష్యం, వ్యర్థాల కారణంగా గోదావరిలో కాలుష్యం పెరిగిపోయిందని నివేదికలు అందడంతో వాటిని ఆమూలాగ్రం పరిశీలించారు. సదరు కంపెనీకి వెంటనే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాలుష్య కారకా లను వేరే ప్రాంతంలోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



కాలుష్య భూతాన్ని తరిమి కొట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఆంధ్రా పేపర్ మిల్ నుంచి వచ్చే వివరణ తర్వాతచర్యలు తీసుకోవాలని.. అవసరమైతే కఠినంగా వ్యవహరించాలని కూడా సూచించారు. గోదావరి పుష్కరాలను పవిత్రంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

**పర్యావరణ చట్టాలు ఎందుకు?**

ఈ సందర్భంగా అధికారులపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఆంధ్రా పేపర్ మిల్లు విషయంలో కొన్ని సూచనలు చేశామని అయినా కంపెనీ పట్టించుకోలేదని అధికారులు వివరణ ఇచ్చారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ఆయన.. పర్యావరణ చట్టాలు ఎందుకు ఉన్నాయి? వాటిని సక్రమంగా అమలు చేయలేరా? అని ప్రశ్నించారు. పర్యావరణ చట్టాల ప్రకారం కాలుష్యానికి కారకులైన వారు ఎలాంటి వారైనా.. ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే వారు పుణ్య స్నానాలు చేశామన్న సంతృప్తితోవెనుదిరగా లని సూచించారు. ఏ ఒక్కరు అసౌకర్యానికి గురైనా అది ప్రభుత్వంపై పడుతుందని చెప్పారు. ఈ విషయంలో ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దని.. ఏదైనా సమస్య ఉంటే తనకు నేరుగా చెప్పాలని పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు.

# అమలాపురంలో గోల్డ్ స్కాం కలకలం

**రోడ్డెక్కిన బాధితులు.. హామీ ఇచ్చిన యజమాని గైర్హాజరు**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :**అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గోల్డ్ స్కాం వ్యవహారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. పట్టణంలోని సిద్ధేశ్వర జ్యువెలరీ సంస్థ సుమారు రూ.5 కోట్ల మేర ఖాతాదారుల డబ్బులు, బంగారం వ్యవహారాల్లో ఇబ్బందులు తలెత్తడంతో బాధితులు ఆందోళన బాట పట్టారు. తమకు న్యాయం చేస్తానని, సమస్యలను పరిష్కరిస్తానని యజమాని హామీ ఇచ్చినప్పటికీ, నిర్ణయించిన రోజున ఆయన అందుబాటులోకి రాకపోవడంతో బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పలువురు బాధితులు రోడ్డుపైకి వచ్చి నిరసన చేపట్టారు. తాము కష్టపడి కూడబెట్టిన సొమ్మును జ్యువెలరీ సంస్థలో పెట్టుబడిగా పెట్టామని, ఇప్పుడు తమ డబ్బులు తిరిగి వస్తాయో లేదో అన్న ఆందోళనలో ఉన్నామని బాధితులు వాపోయారు. యజమాని వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘటన సమాచారం అందుకున్న పోలీసులు పరిస్థితిని పరిశీలించి బాధితులతో మాట్లాడినట్లు తెలిసింది. ఈ




వ్యవహారంపై అధికారుల జోక్యంతో త్వరితగతిన పరిష్కారం చూపాలని బాధితులు కోరుతున్నారు. ఈ గోల్డ్ స్కాం వ్యవహారం అమలాపురంలో ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదం..**

# 24 గంటల్లోనే చెప్పిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేష్

**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపుతూనే ఉంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 9కి చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైడిరాజు అనే మరో ఉద్యోగి ఇవాళ ఉదయం ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో ప్లాంట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మరోవైపు ప్రభుత్వం ప్రకటించిన సహాయక చర్యలు వేగంగా అమలవుతున్నాయి. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బాధిత కుటుంబాలను పరామర్శించి, ఇచ్చిన మాట ప్రకారం 24 గంటలు గడవకముందే మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారం కింద రూ. 25 లక్షల చొప్పున చెక్కులను స్వయంగా అందించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ. 25



లక్షలు, క్షతగాత్రులకు రూ. 10 లక్షలు అందిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. దీనికి అదనంగా రెగ్యులర్ ఉద్యోగి కుటుంబానికి అన్ని ప్రయోజనాలు కలిపి రూ. 1.72 కోట్లు, ఒప్పంద ఉద్యోగి కుటుంబానికి రూ. 45 లక్షలు అందుతాయని వివరించారు. మృతుడు శాశ్వత ఉద్యోగి అయినా, ఒప్పంద ఉద్యోగి అయినా వారి కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని, వారి పిల్లల చదువుల బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపేందుకు కేంద్ర ఉక్కుశాఖ ఇప్పటికే త్రిసభ్య కమిటీని నియమించింది. బొకారో సెయిల్ డైరెక్టర్ ప్రియరంజన్ నేతృత్వంలోని ఈ కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. మరో రెండు రోజుల పాటు విశాఖలోనే ఉండి ప్రమాదానికి గల కారణాలను శోధించనుంది. ఈ దుర్ఘటన కారణంగా స్టీల్‌ప్లాంట్‌కు భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. రెండు రోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోవడంతో సుమారు రూ. 100 కోట్లు, యంత్ర పరికరాలు దెబ్బతినడం వల్ల మరో రూ. 20 కోట్లు, మొత్తంగా రూ. 120 కోట్లకు పైగా నష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎస్ఎంఎస్-1లోని ఒక మిషన్ ఆగిపోగా, మిగిలిన ఐదు మిషన్లతో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**13న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

# పిఠాపురం పర్యటన...!




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గమైన పిఠాపురం పర్యటనకు సంబంధించి స్థానికంగా, పార్టీ శ్రేణుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఆయన ఈ నెల 13న పిఠాపురం పర్యటనకు వస్తున్నారని ప్రచారం జరుగుతోంది. నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న తాగునీరు, సాగునీటి ప్రాజెక్టులతో పాటు స్థానిక మౌలిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్షలు నిర్వహించనున్నారు. ఇటీవల పిఠాపురం యువత కోసం డెప్యూటీ సీఎం ఆదేశాల మేరకు పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతమైంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలన, తదుపరి ప్రణాళికలపై ఆయన దిశా నిర్దేశం చేయనున్నారు. స్థానిక ప్రజలు, రైతులు, మహిళలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా దర్బార్ లేదా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. పిఠాపురాన్ని ఒక ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయలతో ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిని, గతంలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల స్థితిగతులను ఆయన పరిశీలించ నున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనను ప్రభుత్వం గాని, జనసేన పార్టీ గానీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అలా ప్రకటించే వరకూ ప్రస్తుతానికి జరుగుతున్న ప్రచారం అంతా ఊహాగానాలు మాత్రమే. పిఠాపురంనకు పవన్ కళ్యాణ్ తాజా పర్యటన విషయమై ప్రస్తుతానికి ఎటువంటి అధికారిక సమాచారం లేదని ప్రత్తిపాడు జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ నిర్ధారించారు.

**నందమూరి బాలకృష్ణకు**

# 66వ జన్మదిన శుభాకాంక్షలు

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** టాలీవుడ్ హీరో అగ్ర కథానాయకుడు తెలుగు చలనచిత్ర రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న మాస్ హీరో నటసింహం హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 66 వ జన్మదినం సందర్భంగా కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కరప మండలం వ్యవసాయ కమిటీ మెంబర్ మేడిశెట్టి పట్టాభి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పేద ప్రజలకు ఎల్లప్పుడూ బసవతారకం ట్రస్టు ద్వారా ఉచితంగా క్యాన్సర్ కు సంబంధించినటువంటి వ్యాధులకు ఎంతోమందికి ఉచిత వైద్యం అందించిన ఆయనకు భగవంతుడు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలని, అలాగే ప్రజాసేవలో ఉన్న మా బాలయ్య బాబుకు రాజకీయంగా మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.




**జగన్‌కు స్టీల్ ప్లాంట్ అనే పదం పలికే**

# అర్హత కూడా లేదు

**జగన్ విశాఖ పర్యటన నేపథ్యంలో హోం మంత్రి అనిత విమర్శలు**

**స్టీల్ ప్లాంట్ భూములను రాజధాని అవసరాలకు వాడుకోవాలని జగన్ భావించారని విమర్శ**

**కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో.. ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంశంపై గత ఐదేళ్లలో జగన్ వ్యవహరించిన తీరును తప్పుబడుతూ ఘాటైన ఆరోపణలు చేశారు. అసలు జగన్‌మోహన్ రెడ్డికి "విశాఖ స్టీల్ ప్లాంట్" అనే పదం పలికే అర్హత కూడా లేదని హోంమంత్రి స్పష్టం చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను రాజధాని అవసరాల కోసం వినియోగించుకోవాలని జగన్ భావించారని, ఈ విషయాన్ని ఒక సీనియర్ ఐఏఎస్ అధికారే స్వయంగా వెల్లడించారని అనిత పేర్కొన్నారు. "స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు సంవత్సరాల తరబడి ఆందోళనలు చేస్తుంటే.. జగన్ కనీసం ఒక్కరోజు కూడా ధర్నా ప్రాంగణానికి వెళ్లి వారికి మద్దతు తెలపలేదు. అప్పట్లో కార్మికులను విమానాశ్రయానికి పిలిపించుకుని మాట్లాడిన జగన్.. ఇప్పుడు కూడా కార్మిక సంఘాల నాయకులను తన వద్దకే పిలిపించుకుని రాజకీయం చేస్తున్నారు" అని హోంమంత్రి మండిపడ్డారు. ఒకప్పుడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్.. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కృషితో 99 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేసే స్థితికి చేరుకుందని వంగలపూడి అనిత వెల్లడించారు. కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందంటూ ఆమె పలు కీలక అంశాలను ప్రస్తావించారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదాల్లో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి తొలిసారిగా 'శాశ్వత ఉద్యోగం' కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని కేంద్ర ఉక్కు మంత్రి హెచ్.డి. కుమారస్వామి తీసుకున్నారని తెలిపారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రస్తుతం రూ.60 లక్షల నుండి రూ.1 కోటి వరకు బీమా ప్రయోజనాలు అందుతున్నాయని చెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్కసారి కూడా కేంద్ర ఉక్కు మంత్రిని విశాఖకు తీసుకురాలేకపోయారని, కానీ ప్రస్తుత కేంద్ర మంత్రి కుమారస్వామి స్వయంగా ప్లాంట్‌లో తెల్లవారుజాము వరకు ఉండి పరిస్థితులను సమీక్షించారని అనిత గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంపై స్పందిస్తూ.. ఆ సంస్థ రూ.150 కోట్ల బీమా చెల్లించాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వం కేవలం రూ.12 కోట్లు మాత్రమే కట్టించుకుని చేతులు దులుపుకుందని హోంమంత్రి ఆరోపించారు. అంతేకాకుండా, గంగవరం పోర్టులో ఏపీ ప్రభుత్వానికి రావాల్సిన 10.24 శాతం వాటాను కూడా గత వైసీపీ ప్రభుత్వమే వదులుకుందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడింది తమ కూటమి ప్రభుత్వమేనని, ప్లాంట్ పరిరక్షణ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
గురువారం, 11 జూన్ 2026
www.viswamvoice.com





# మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన

**విద్యతో పాటు దేశానికి క్రీడలూ అత్యవసరం - రాజమహేంద్రవరం క్రీడా చరిత్రలో చారిత్రాత్మక ఘట్టంకు శ్రీకారం**

**ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్య ఎంత ముఖ్యమో దేశ అభివృద్ధికి క్రీడలు కూడా అంతే అవసరమని రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. బుధవారం వీఎల్‌పురంలో రూ.13.76 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (అరీనా-2) శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ పురంధేశ్వరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా ముఖ్య అతిథులుగా పాల్గొని భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ, ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా క్రీడారంగానికి కేంద్ర ప్రభుత్వం విస్తృత ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ అందించడమే లక్ష్యమన్నారు. టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టివోపిఎస్) ద్వారా అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు ప్రత్యేక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్మిస్తున్న అరీనా-1కు రాష్ట్ర ప్రభుత్వం రూ.28 కోట్లు, అరీనా-2కు కేంద్ర ప్రభుత్వం రూ.13.76 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరంలో అత్యాధునిక క్రీడా వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. రాజమండ్రి అర్బన్ శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ,రాజమహేంద్రవరం క్రీడా చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. దశాబ్దాలుగా క్రీడాకారుల కలగా ఉన్న ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కూటమి ప్రభుత్వం కార్యరూపంలోకి తీసుకువచ్చిందన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు రాజమహేంద్రవరం వేదికగా నిలిచేలా అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ఇప్పటి వరకు సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరాన్ని క్రీడా కేంద్రంగాను కూడా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అరీనా-1, అరీనా-2, అరీనా-3 పూర్తయిన తర్వాత రాష్ట్రంలోనే అత్యుత్తమ క్రీడా సముదాయాల్లో ఒకటిగా ఈ ప్రాంగణం నిలుస్తుందన్నారు. అత్యాధునికసదుపాయాలతో నిర్మిస్తున్న ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మొత్తం 13 కోర్టులు, వేలాది మంది ప్రేక్షకులు వీక్షించే సౌకర్యం, అంతర్జాతీయ ప్రమాణాల ఫ్లోరింగ్, ఎల్ఈడీ లైటింగ్, వెంటిలేషన్, భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ తదితర క్రీడలకు అనువుగా ఈసముదాయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, అదనపు కమిషనర్ వి.వి. రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకటరమణ, ఈఈ మదర్సా అలీ, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, విద్యార్థులు, యువ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరిరక్షణ, సేంద్రీయ

## వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

**కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎపిఎఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డి.ఎ.పి విక్రయాల్లో పారదర్శకతజిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిజిల్లాలోని రైతులు భూసార పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు.బుధవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూవ్యవసాయంలో యూరియా వినియోగాన్ని అవసరమైన మేరకు పరిమితం చేసి, వర్మీ కంపోస్ట్ వంటి సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా భూసారాన్ని కాపాడడంతో పాటు సాగు ఖర్చులను కూడా తగ్గించవచ్చని తెలిపారు. రైతులందరూ ఆర్గానిక్ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు.భూసార పరిరక్షణ, సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సాహం, రసాయనిక ఎరువుల సమతుల్య వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మట్టి ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా దీర్ఘకాలికంగా వ్యవసాయ ఉత్పాదకతను పెంచవచ్చని చెప్పారు. రైతులకు భూసార పరీక్షలు, సేంద్రీయ ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుతెలిపారు.ఈ సందర్భంగా జిల్లాలో ఈనెల 8వ తేదీ నుంచి ఎపిఎఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డి.ఎ.పి విక్రయాలనుప్రారంభించినట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ విధానం ద్వారా సాగు చేసే ప్రతి రైతుకు ఎరువుల లభ్యతను పారదర్శకంగా, సరళంగా అందించడంతో పాటు వ్యవసాయేతర అవసరాలకు ఎరువుల మళ్లింపును నివారించ వచ్చన్నారు. ఖరీఫ్-2026 సీజన్‌లో జిల్లాలో 1,66,840 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు అవుతాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.ఈ సీజన్‌కు మొత్తం 33,289 మెట్రిక్ టన్నుల యూరియా, 6,617 మెట్రిక్ టన్నుల డి.ఎ.పిఅవసరమవుతాయని పేర్కొన్నారు. జూన్ నెల వరకు 6,150 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ప్రస్తుతం 9,837 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని, అదనంగా ఈ నెలలో 8,330 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరనుందని వివరించారు.ఎపిఎఐఎంఎస్ యాప్‌లో రైతుల పంట, విస్తీర్ణం, భూ వివరాలను నవీకరించుకునే అవకాశం కల్పించామని, రైతులు తమ వివరాలను పరిశీలించి అవసరమైతే సవరణలు చేసుకోవాలని సూచించారు. అలాగే ఆర్ఎస్కేల పరిధిలోని డీలర్ల మ్యాపింగ్, రైతుల ధృవీకరణ తదితర ప్రక్రియల ద్వారా ఎరువుల పంపిణీని మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఎపిఎఐఎంఎస్ యాప్ ద్వారా ప్రతి సాగుదారునికి ఎరువుల లభ్యతకు హామీ, పారదర్శక విక్రయ విధానం, భూసార పరిరక్షణ, సమర్థవంతమైన పర్యవేక్షణ వంటి ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. యాప్‌పై రైతులు, ప్రైవేట్ డీలర్లు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు రెవెన్యూ డివిజన్ అధికారి కె.ఆనందరావు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ డిపిఎం బి.తాతారావు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎఐ ఎల్ఐసి ఈ వెల్ఫేర్ అసోసియేషన్

## జాతీయ కార్యదర్శిగా సమతం గన్నేయ్య



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆల్ ఇండియా ఎల్ఐసి ఎం ప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శిగా సమతం గన్నేయ్య ఏకగ్రీవ ఎన్నికపై దళిత, గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవలే నాగపూర్(మహా రాష్ట్ర)లో జరిగిన ఆల్ ఇండియా ఎల్ఐసి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ కాన్ఫరెన్స్‌లో ఆలిండియా కార్యవర్గ ఎన్నికలలో జాతీయ కార్యదర్శిగా రాజమండ్రి డివిజన్ ఎల్ఐసి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్కు సుదీర్ఘ కాలం నుంచి ప్రధాన కార్యదర్శిగా సేవలు అందిస్తూ అనేక సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే సమతం గన్నేయ్యను జాతీయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం, ఎస్సీ ఎస్టీ విద్యార్థుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే సమతం గన్నేయ్య నియామకం పై రాష్ట్ర దళిత గిరిజన నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, ఉరుమర్తి రామారావు, అద్దాల కుమార్ బాబు, జె.వెంకటేశ్వరరావు, ఎలిపే శ్రీనివాసు, పులు దుండి ఆనందకుమార్, డి.వీ కిషోర్ సిహెచ్ భాస్కర్ అరవింద్ దేశబత్తుల సందీప్, రాజేష్, వై.శ్రీనివాసు, జంగం సుబ్బారావు, రాధా కృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు ఆనందం వ్యక్తం చేసారు.

నేడు ఈ గ్రామాల్లో

## విద్యుత్‌కు అంతరాయం : నక్కపల్లి

**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మత్తుల నిమిత్తం నేడు ఈ కింది గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కోరుకొండ MHQ ,11kv నరసింహ స్వామి ఫీడర్ పరిధిలో వార్షిక మరమ్మత్తుల్లో భాగంగా చెట్లు నరకడం వంటి పనుల కారణంగా ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. కోరుకొండ మండలంలోని కోరుకొండ, జంబుపట్నం, పశ్చిమ గోనగుడెం, ఫిల్మ్ నగర్, కాపవరం ప్రాంతంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని, కావున విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ ఆసౌకర్యమును గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలన్నారు.

మనసున్న మంచి మనిషి

## 'బాలయ్యబాబు'

**ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు**

**జన్మదిన సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ**

**హాజరైన నందమూరి వంశాభిమానుల సంఘం గౌరవ అధ్యక్షులు గన్నికృష్ణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సినిమాలు, రాజకీయాలతో బిజీగా ఉంటూనే మరోవైపు బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్గా వేలాదిమంది రోగులకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తూ నందమూరి బాలకృష్ణ రియల్ హీరోగా నిలుస్తున్నారని గుడా మాజీ చైర్మన్, నందమూరి వంశాభిమానుల సంఘం గౌరవాధ్యక్షుడు గన్ని కృష్ణ అన్నారు. హిందూపురం ఎమ్మెల్యే యువరత్న నందమూరి బాలకృష్ణ జన్మదినోత్సవ సందర్భంగా ఎన్టీఆర్-బాలకృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక బైపాస్ రోడ్డు లోని బాలకృష్ణ బస్టాప్ వద్ద బుధవారం బాలయ్య జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన అభిమానులు పార్టీ నాయకుల మధ్య గన్ని కృష్ణ పుట్టినరోజు కేక్ కట్ చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గన్ని కృష్ణ మాట్లాడుతూ తన ఊరమాస్ నటనతో శాసించే 'గాడ్ ఆఫ్ మాసెస్' నందమూరి బాలకృష్ణ నిజ జీవితంలో మంచి మనసున్న మారాజుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు అని కొనియాడారు తెలుగు చలనచిత్ర రంగంలో విభిన్న పాత్రలు పోషించి పౌరాణిక జానపద సాంఘిక చిత్రాల్లో తన నటన వైభవంతో తెలుగు ప్రేక్షకులు రంజింపజేసే బాలకృష్ణ రాజకీయాల్లోనూ అదే ఒరవడిని కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు రత్నాకర్, పరిమి వాసు, నిమ్మలపూడి గోవింద్,గొర్రెల రమణ, బిక్కిన సాంబ, కె. వి. శ్రీనివాస్, వానపల్లి శ్రీనివాస్, జి కొండబాబు, కొండ, నాగు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు, దుస్తుల పంపిణీ చేసిన

## స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్

**- దాతల సేవలు ఆదర్శనీయమన్న పోసి కుమార్**



**ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవలేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ఉదయం ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోసి కుమార్ మాట్లాడుతూ దాత జి.జయప్రద పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు, దాతలు జి.జై కుమార్, జి.జయప్రద దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు దాతలు మరింతగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కె.వి.ఆర్. సాగర్, బి.దుర్గా, పలివల వీరేష్‌తో పాటు వృద్ధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

## మహిళల స్వయం ఉపాధికి నైపుణ్యాభివృద్ధే మార్గం

**రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ప్రారంభం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక రెడ్ క్రాస్ భవనంలో మహిళల కోసం టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం పెదిరెడ్డి శ్వేత ముత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక పరిపుష్టి, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. శిక్షణ ద్వారా మహిళలు స్వయం సమృద్ధి సాధించి కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడగలరని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మానవత్వం, సేవా భావంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డాక్టర్ కె.వి. రమణ, కోశాధికారి డాక్టర్ జి. మహాలక్ష్మి, ఎంసీ సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు, డాక్టర్ జె. సురేష్, బోను రామకృష్ణ, డాక్టర్ నూర్ బేగ్, ఏఆర్‌జీహెచ్ ఎంసీ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శివమణి, ఫ్యాషన్ డిజైనింగ్ ట్రైనర్ ఎం.అరుణశ్రీ, డీఎఫ్ఓ గోపీకృష్ణ, పద్మ, భావనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సామర్థ్య పెంపుదలకు శిక్షణ

**ముగిసిన ఎఫ్ఎల్ఎన్ 'జ్ఞాన ప్రకాశ్' శిక్షణా తరగతులు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో నిర్వహించిన ఆరు రోజుల ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) 'జ్ఞాన ప్రకాశ్' శిక్షణా కార్యక్రమం మంగళవారంతో విజయవంతంగా ముగిసిందని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వై.లక్ష్మణ్ కుమార్ తెలిపారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం, దేవరపల్లి మండలం దుద్దుకూరు జెడ్పీహెచ్ఎస్, రాజమండ్రి రూరల్ మండలం హుకుంపేట జెడ్పీహెచ్ఎస్, కోరుకొండ మండలం గాడాల జెడ్పీహెచ్ఎస్, అనపర్తి మండలం డీబీఎస్ జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐదు శిక్షణా కేంద్రాల్లో ఒకటి, రెండు తరగతులు బోధించే మొత్తం 963 మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించినట్లు ఆయన తెలిపారు. హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ఎఫ్ఎల్ఎన్‌పై నిర్వహించిన ఈ ఆరు రోజుల ఇంటెన్సివ్ సామర్థ్య పెంపుదల శిక్షణ ఫౌండేషనల్ ఎడ్యుకేషన్‌లో ఒక కీలకమైన మార్పుకు నాంది పలుకుతుందని అన్నారు. గత ఆరు రోజులుగా ఉపాధ్యాయులు చూపిన చురుకైన భాగస్వామ్యం, పరస్పర అభ్యాసం, అంకితభావం చిన్నారుల విద్యా భవిష్యత్తును పునర్నిర్మించే ఉమ్మడి సంకల్పానికి నిదర్శనమని అభినందించారు. ఈ శిక్షణ కేవలం వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి చిన్నారి బలమైన పునాది నైపుణ్యాలతో విద్యా స్రవంతిలో ముందుకు సాగేందుకు ఇది మూలస్తంభంగా నిలుస్తుందని పేర్కొన్నారు. శిక్షణ యొక్క అసలైన ఫలితాలు ఉపాధ్యాయులు తిరిగి తరగతి గదుల్లోకి వెళ్లిన తర్వాత కనిపిస్తాయని అన్నారు. అలాగే నెలవారీ సమావేశాల సందర్భంగా తల్లిదండ్రులకు ఇంట్లో పిల్లల్లో పఠనం, లెక్కింపు అలవాట్లను పెంపొందించే విధానాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్, రూరల్ మండల విద్యాశాఖ అధికారి-2 చందు కుమార్, డైట్ లెక్చరర్ సాయి రామకృష్ణ, కేఆర్పీ కృపావతి, డీఆర్పీలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమాజానికి రోటరీ సంస్థ సేవలు ఎనలేనివి..

**డాక్టర్ రాజశేఖర్ కెన్నెడీ - రోటరీ ఒకేషనల్ అవార్డ్స్ అందజేత**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వవ్యాప్తంగా పోలియో నిర్మూలన లాంటి అసమాన మానవ ఉపయుక్త కార్యక్రమాలు చేస్తున్నరోటరీ ఇంటర్నేషనల్ వారి సేవలు ఎనలేనివని స్థానిక ప్రభుత్వ బోధన జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి రాజశేఖర్ కెన్నెడీ అన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ నందు మెడికల్ మరియు వెల్ఫేర్ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఐదుగురికి రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సిటీ వారిచే రోటరీ వోకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు (రోవెక్స్ ) సూపరింటెండెంట్ చేతుల మీదుగా అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షులు లంకలపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి అక్కల వీర దీపిక, ఒకేషనల్ సర్వీసెస్ డైరెక్టర్ ఎస్ నాగేంద్ర కిషోర్, రోటీరియన్ సుంకర గౌతమ్ కుమార్, రోటరీ లాంఛనాలతో సేవా పురస్కార ప్రశంసా పత్రాలు చదివి గ్రహీతలకు జ్ఞాపిక దుశాలు వా ,మెడల్ లను అందజేశారు.

**ప్రభుత్వ ఆసుపత్రి లో రోవెక్స్ అవార్డు గ్రహీతలు.**

డాక్టర్ ఎన్ అన్నపూర్ణ అసోసియేట్ ప్రొఫెసర్ సైకియాట్రి, గంధం వెంకటలక్ష్మి హెడ్ నర్స్, ఎం.సత్యవతి హెడ్ నర్స్, అత్తిలి శ్రీనివాసరావు ఎంఎన్ఓ, ఏకే హరినాథ్ డైటీషియన్ గ్రేడ్ వన్.



# భారతీరాజాకి సీఎం విజయ్ నివాళి

## ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు



దిగ్గజ దర్శకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత భారతీరాజా (84) మృతి పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతీరాజా పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ఆయన ఓ కీలక ప్రకటన చేశారు. తమిళ సినిమాకు ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా భారతీరాజా అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు విజయ్ ప్రకటించారు. దర్శక శిఖరం భారతీరాజాకు సినీ ప్రపంచం నివాళులు అర్పిస్తోంది. ఆయన కడసారి దర్శనం కోసం చెన్నైలోని భారతీరాజా నివాసానికి సినీ, రాజకీయ ప్రముఖులు తరలివస్తున్నారు. దిగ్గజ దర్శకుడి పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పిస్తున్నారు. ఈ క్రమంలోనే తమిళనాడు ముఖ్యమంత్రి భారతీరాజా(84) మరణ వార్త వినగానే విజయ్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం చెన్నైలోని భారతీరాజా నివాసానికి వెళ్లి పార్థీవదేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారతీరాజా పార్థీవ దేహంపై తలవాల్చి విజయ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన మృతి సినిమా ఇండస్ట్రీకి తీరని లోటని సంతాపం తెలిపారు. ఈ నేపథ్యంలో భారతీరాజా అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు విజయ్ ప్రకటించారు. తమిళ చలనచిత్ర పరిశ్రమకు ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సీఎం విజయ్‌తో పాటు తమిళనాడు మాజీ సీఎం స్టాలిన్, సీనీ నటి సినీ నటి రాధికా, హీరో సూర్య కూడా భారతీరాజా నివాసానికి చేరుకొని నివాళులర్పించారు. అంతకుముందు, తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తమ వ్యవస్థాపక అధ్యక్షుడైన భారతీరాజాకు తుది వీడ్కోలు పలికేందుకు ప్రభుత్వ గౌరవ వందనాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి విజయ్ కు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ అభ్యర్థనకు తక్షణమే స్పందించిన సీఎం విజయ్.. ఈ గౌరవప్రదమైన నిర్ణయాన్ని వెల్లడించారు. అంతకు ముందు తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి మెగాస్టార్ చిరంజీవి, పవన్ కల్యాణ్, అల్లు అర్జున్ తదితర సినీ ప్రముఖులు భారతీరాజాకు నివాళులు అర్పించారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని ఎమోషనల్ అయ్యారు.

# 24 ఏళ్లకే పెళ్లి కాకుండానే తల్లైంది..

### 10 సంవత్సరాలుగా సినిమాలకు దూరం.. అయినా ఇప్పటికీ తగ్గని క్రేజ్..

సాధారణంగా సినీరంగంలో హీరోహీరోయిన్లకు సంబంధించిన వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడానికి జనాలు తెగ ఆసక్తి చూపిస్తుంటారు. ఈమధ్య కాలంలో తారల లవ్, మ్యారెజ్, డివోర్స్.. ఇలా ప్రతి చిన్న విషయం నెట్టింట క్షణాల్లో చక్కర్లు కొడుతుంది. ఇక ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న ఓ హీరోయిన్ పేరు సైతం నిత్యం వార్తలలో నిలుస్తుంటుంది. వివాహం అనేది ఒక వ్యక్తిగత నిర్ణయం. సెలబ్రిటీల విషయానికి వస్తే, వారి వ్యక్తిగత నిర్ణయాలపై అభిమానులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వెల్లడిస్తూనే ఉన్నారు. ఇక ఈ నటి విషయానికొస్తే, ఆమె పెళ్లి చేసుకోకుండా జీవిస్తోంది. కానీ, ఆమె 24 ఏళ్లకే తల్లి అయింది. అయితే కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడే తాను తీసుకున్న నిర్ణయం కారణంగా ఆమె సినీ కెరీర్ మొత్తం నాశనమైపోతుందని ఆమె మేనేజర్ హెచ్చరించారు. కానీ ఆ నటి దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత సైతం ఆమె వరుస హిట్ మూవీస్ చేసి స్టార్ డమ్ అందుకుంది. గత 10 ఏళ్లుగా ఆమె ఏ సినిమాల్లోనూ నటించలేదు. అయినప్పటికీ ఆమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? తనే హీరోయిన్ సుష్మితా సేన్. 1997లో ప్రవీణ్ గాంధీ దర్శకత్వంలో నాగార్జున నటించిన రక్షకుడు సినిమాలో కథానాయికగా కనిపించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఈ సినిమాతో సౌత్ ఇండస్ట్రీలో ఫుల్ ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత ఆమె అర్జున్ నటించిన 'ముత్తలవన్' చిత్రంలో ప్రత్యేక పాత్రలో కనిపించింది. కానీ ఆమెకు ఆశించిన స్థాయిలో ఆఫర్స్ రాలేదు. తెలుగులో క్లిక్ కాకపోయినప్పటికీ ఆమె బాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా ఎదిగింది. అయితే పెళ్లి చేసుకుండానే 2000వ సంవత్సరంలో 24 ఏళ్ల వయసులోనే ఒక బిడ్డను దత్తత తీసుకుంది. ఆమె ఆ బిడ్డకు రెనీ సేన్ అని పేరు పెట్టారు. ఆ తర్వాత, 2010లో, ఆమె అలిస్సా అనే మరో పాపను దత్తత తీసుకున్నారు. ఒక ఇంటర్వ్యూలో, ఆ సమయంలో తన మేనేజర్ అలా చేయవద్దని తనను గట్టిగా హెచ్చరించారని సుష్మితా సేన్ చెప్పారు. "నా నిర్ణయం తర్వాత, నా మేనేజర్ నా దగ్గర జాబ్ మానేశారు. నీకు నీ కెరీర్ పట్ల శ్రద్ధ లేదు. 24 ఏళ్లకే తల్లి అయిన మీతో నేను పనిచేయాలనుకోవడం లేదు. నీకు బాలీవుడ్‌లో కనీసం క్యారెక్టర్ రోల్ కూడా రాదు అని నా మేనేజర్ అన్నారు. కానీ, మీరు నమ్మరు. ఆ తర్వాతే నేను భారీ హిట్లు ఇచ్చాను " అని చెప్పుకొచ్చింది సుష్మితా సేన్. 1994లో సుష్మితా సేన్ మిస్ యూనివర్స్ టైటిల్ గెలుచుకున్న భారతదేశపు మొట్టమొదటి మహిళగా నిలిచారు. అందాల పోటీకి బట్టలు కొనడానికి కూడా ఆమె దగ్గర డబ్బు లేదు. మిస్ యూనివర్స్ పోటీలో గెలిచినప్పుడు తాను ధరించిన దుస్తులను ఒక స్థానిక టైలర్ దగ్గర అప్పుగా కుట్టించుకున్నానని ఆమె చెప్పారు. సుష్మితా సేన్ చివరిసారిగా 2015లో విడుదలైన ఒక బెంగాలీ చిత్రంలో నటించారు. గత 10 సంవత్సరాలుగా ఆమె ఏ సినిమా చేయలేదు. అయినప్పటికీ సోషల్ మీడియాలో ఆమెకు విపరీతమైన క్రేజ్ ఉంది.



### 9 ఏళ్ల తర్వాత లంక గడ్డపై అడుగుపెట్టనున్న టీమిండియా..

# విరాట్ కోహ్లీ రికార్డు బ్రేక్ చేస్తారా?




దాదాపు 9 ఏళ్ల తర్వాత టీమిండియా శ్రీలంక గడ్డపై టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే ఈ డబ్ల్యూటీసీ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత్, లంకను ఢీకొననుంది. విరాట్ కోహ్లీ రికార్డులపై కూడా ఆసక్తి నెలకొంది. భారత క్రికెట్ అభిమానులకు ఒక అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. టీమిండియా సుదీర్ఘ విరామం తర్వాత పొరుగు దేశమైన శ్రీలంకలో టెస్ట్ సిరీస్ ఆడేందుకు సిద్ధమవుతోంది. దాదాపు 9 సంవత్సరాల తర్వాత భారత జట్టు లంక గడ్డపై వైట్ జెర్సీతో బరిలోకి దిగబోతుండటం విశేషం. చివరిసారిగా 2017లో విరాట్ కోహ్లీ సారథ్యంలో భారత జట్టు శ్రీలంకలో టెస్ట్ సిరీస్ ఆడింది. అప్పట్లో లంకను వారి సొంత గడ్డపైనే క్లీన్ స్వీప్ చేసి కోహ్లీ సేన చరిత్ర సృష్టించింది. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత టీమిండియా అక్కడ అడుగుపెడుతుండటంతో ఈ టూర్ ఫుల్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.

**స్వాతంత్ర్య దినోత్సవం రోజున మొదటి టెస్ట్ ప్రారంభం**

ప్రముఖ క్రీడా వెబ్‌సైట్ క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. భారత్, శ్రీలంక మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆగస్టు 15న ఘనంగా ప్రారంభం కానుంది. సరిగ్గా భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున గాల్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా మొదటి టెస్ట్ మ్యాచ్ మొదలవుతుంది. ఈ మ్యాచ్ ఆగస్టు 15 నుంచి 19 వరకు జరుగుతుంది. ఆ తర్వాత కొద్దిరోజుల గ్యాప్‌తో ఆగస్టు 23 నుంచి రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే, ఈ రెండో మ్యాచ్ జరగబోయే వేదికపై లంక బోర్డు ఇంకా అధికారిక ప్రకటన చేయనప్పటికీ, సెంట్రల్ కొలంబోలోని ప్రసిద్ధ సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో నిర్వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో కీలకంగా మారనున్న సిరీస్**

శ్రీలంకతో జరగబోయే ఈ రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కేవలం ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కాదు. ఇది ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా జరగబోతోంది. కాబట్టి ఫైనల్ రేసులో నిలవాలంటే రెండు జట్లకూ ఈ సిరీస్ అత్యంత కీలకం కానుంది. ఇప్పటివరకు శ్రీలంక క్రికెట్ బోర్డు కానీ, భారత క్రికెట్ నియంత్రణ మండలి కానీ ఈ షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించలేదు. కానీ అంతర్గత సమాచారం ప్రకారం ఈ తేదీలు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ ఈ సిరీస్ ఆడబోతుండటం గమనార్హం.

**టెస్టులతో పాటు టీ20ల ధమాకా కూడా**

ఈ పర్యటనలో కేవలం టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే కాకుండా, అభిమానులను అలరించడానికి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా కూడా హింట్ ఇచ్చారు. లంక బోర్డు నుంచి అదనంగా మూడు టీ20 మ్యాచ్‌లు ఆడాల్సిందిగా తమకు అభ్యర్థన వచ్చిందని ఆయన మీడియాకు వెల్లడించారు. దీనిపై బీసీసీఐ సానుకూలంగానే ఉందని, త్వరలోనే మ్యాచ్‌ల తేదీలు, వేదికలతో కూడిన పూర్తి అధికారిక షెడ్యూల్‌ను ఇరు దేశాల బోర్డులు సంయుక్తంగా విడుదల చేస్తాయని ఆయన స్పష్టం చేశారు.

### హిట్‌మ్యాన్ ఇచ్చిన టిప్స్‌తో ఇండియాకే స్కెచ్..

# అఫ్గాన్ మిస్టరీ స్పిన్నర్ సంచలన వ్యాఖ్యలు!




ముంబై ఇండియన్స్‌లో రోహిత్ శర్మ నుంచి నేర్చుకున్న రహస్యాలను ఇప్పుడు టీమిండియాపైనే ప్రయోగిస్తానంటూ అఫ్ఘనిస్తాన్ యువ స్పిన్నర్ అల్లా గజన్‌ఫర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత్-అఫ్ఘాన్ వన్డే సిరీస్‌కు ముందు అతడి మాటలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ జట్టు తరఫున రోహిత్ శర్మతో కలిసి ఆడిన అఫ్ఘనిస్తాన్ యువ స్పిన్నర్ అల్లా గజన్‌ఫర్ ఇప్పుడు భారత జట్టుకే సవాల్ విసురుతున్నాడు. జూన్ 13 నుంచి ధర్మశాల వేదికగా భారత్, అఫ్ఘనిస్తాన్ మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మాట్లాడిన ఈ 19 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్.. ఐపీఎల్ సమయంలో రోహిత్ శర్మ దగ్గర నేర్చుకున్న మెళకువలను, రహస్యాలను ఇప్పుడు భారత బ్యాటర్లపైనే ప్రయోగించడానికి ఎదురుచూస్తున్నట్లు ప్రకటించి సంచలనం సృష్టించాడు. ముంబై ఇండియన్స్ నెట్ ప్రాక్టీస్ సమయంలో ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్ అయిన రోహిత్ శర్మకు నిరంతరం బౌలింగ్ చేసే అవకాశం గజన్‌ఫర్‌కు దక్కింది. ఈ అనుభవం ప్రపంచ స్థాయి బ్యాటర్లను ఎలా ఎదుర్కోవాలో, వారి బలహీనతలు ఏమిటో అర్థం చేసుకోవడానికి తనకు ఎంతగానో ఉపయోగపడిందని ఈ యువ స్పిన్నర్ తెలిపాడు. రోహిత్ భాయ్ ఒక గొప్ప ఆటగాడని, అతను ఇన్నింగ్స్ ప్రారంభిస్తే తాను కొత్త బంతితో బౌలింగ్ చేస్తానని చెప్పాడు. ఐపీఎల్‌లో అతని నుంచి నేర్చుకున్న ప్రతి విషయాన్ని, దేవుడి దయతో రాబోయే సిరీస్‌లో మా జట్టు ప్రయోజనం కోసం వాడుకుంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఐపీఎల్ డ్రెస్సింగ్ రూమ్‌లో రోహిత్ శర్మ కేవలం బౌలింగ్ గురించే కాకుండా, వ్యక్తిగతంగా తన బ్యాటింగ్ మెరుగుపరుచుకోవడానికి కూడా సలహాలు ఇచ్చాడని గజన్‌ఫర్ గుర్తుచేసుకున్నాడు. తాను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు రోహిత్ దగ్గరుండి కొన్ని ముఖ్యమైన సూచనలు చేశాడని, ఆ మాటలకు తాను ఎల్లప్పుడూ కృతజ్ఞతుడిగా ఉంటానని చెప్పాడు. ముంబై ఇండియన్స్ క్యాంపులో జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లతో గడపడం తన కెరీర్‌ను మలుపు తిప్పిందని, క్రికెట్ అనేది నిరంతరం నేర్చుకునే ప్రక్రియ అని అతను చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం భారతదేశంలో ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ, తాము ఇక్కడి వాతావరణానికి పూర్తిగా అలవాటు పడ్డామని గజన్‌ఫర్ తెలిపాడు. ఐపీఎల్ కారణంగా ఆటగాళ్లంతా ఫుల్ ఫామ్‌లో ఉన్నారని, ఈ సిరీస్ కోసం తమ దేశంలో కాకుండా ప్రత్యేకంగా కాబుల్‌లో నెల రోజుల పాటు ట్రైనింగ్ క్యాంప్ నిర్వహించామని వెల్లడించాడు. అక్కడి పిచ్‌లు, ఇక్కడి పిచ్‌లు ఒకేలా ఉండటం వల్ల తమ జట్టు ఆటగాళ్లంతా మంచి జోష్‌లో ఉన్నారని, భారత బలమైన బ్యాటింగ్ లైనప్‌ను ఢీకొట్టడానికి తమ వ్యూహాలు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశాడు. అఫ్ఘనిస్తాన్ క్రికెట్‌లో ప్రస్తుతం పోటీ చాలా పెరిగిపోయిందని, దేశీయ స్థాయి నుంచి నేరుగా అంతర్జాతీయ జట్టులోకి రావడం ఇప్పుడు చాలా కష్టంగా మారిందని గజన్‌ఫర్ అన్నాడు. అయితే కష్టపడే తత్వం ఉంటే ఏదైనా సాధ్యమేనని నిరూపించామన్నాడు. చాలామంది యువ ఆటగాళ్లకు రషీద్ ఖాన్, మహ్మద్ నబీ రోల్ మోడల్స్ అయినప్పటికీ, తనకు మాత్రం మొత్తం అఫ్ఘనిస్తాన్ జట్టే పెద్ద ప్రేరణ అని చెప్పాడు. చిన్నప్పటి నుంచి తమ జాతీయ జట్టు ఆడే విధానాన్ని చూస్తూనే తామంతా పెరిగామని ఎమోషనల్ అయ్యాడు. ఈ సిరీస్ నుంచి హార్దిక్ పాండ్యా దూరమవ్వడం భారత్‌కు కాస్త మైనస్ అయినప్పటికీ.. అఫ్ఘాన్ స్పిన్ మాయాజాలాన్ని భారత బ్యాటర్లు ఎలా తట్టుకుంటారో చూడాలి మరి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com